

ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 21-03-2026 | సంపుటి - 27 | సంచిక -298 | రూ : 4 | పేజీలు: 8

# మూసీపై ముందుకే.. రాజీ లేదు

- భారాస, భాజపా ఒక్కటే
- మొయినాబాద్ డ్రగ్స్ కేసుపై భాజపా నేతలు ఎందుకు స్పందించరు?
- ఫోన్ ట్యాపింగ్ కేసుకు.. హరీశ్‌రావుపై కొట్టేసిన కేసుకు సంబంధం లేదు
- బడ్జెట్‌లో సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం
- మీడియాతో ఇష్టాగోష్ఠిలో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: ''మొయినాబాద్ ఫాం హౌస్ డ్రగ్స్ కేసులో పోలీసులపై కాల్పులు జరిగినా.. భాజపా నేతలు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రామచందర్‌రావు ఎందుకు నోరు మెదపలేదు? అయిన దానికి, కాని దానికి స్పందించే భాజపా నాయకులు.. భారాస మాజీ ఎమ్మెల్యే ఫాంహౌస్‌లో ఇంత పెద్ద ఘటన జరిగినా ఎందుకు మాట్లాడలేకపోతున్నారు? ఆ రెండు పార్టీలు ఒకటేనని చెప్పడానికి ఇది నిదర్శనం కాదా?'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ''భారాస హయాంలో దాదాపు 6 వేల ఫోన్లను ట్యాపింగ్ చేసినట్లు ఆరోపణలున్నాయి. ఈ కేసు విచారణలో ప్రభాకర్‌రావు అందుబాటులో లేకపోవడంతో.. 20 నెలలు ఆలస్యమైంది. ఆయనిచ్చిన వివరణ ద్వారా బాధితులను పిలిపించి విచారిస్తున్నాం.

తరువాయి 2లో

# సంక్షేమానికి.. నవోదయం

- తొమ్మిది కొత్త పథకాలకు శ్రీకారం
- మొత్తంగా ఆ రంగానికి రూ. 1,45,591 కోట్ల కేటాయింపు
- ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా
- ప్రతి ఒక్కరి హెల్త్‌ప్రొఫైల్‌తో డిజిటల్ కార్డు
- ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు ఆరోగ్య భద్రత, ప్రమాద బీమా
- పేదల విద్యకు పెద్దపీట.. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు రూ. 5,000 కోట్లు
- గ్యారంటీ హామీల అమలుకు రూ.50,713 కోట్లు
- కొత్త బడ్జెట్ ముఖచిత్రం



హైదరాబాద్: సంక్షేమం, అభివృద్ధి పథకాల జోడు గుర్రాల సవారీకి కొత్త బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. నూతనంగా... తొమ్మిది సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టింది. ఇంతకాలం సంక్షేమం అంటే పేదలకే అనే భావన ఉండగా.. రాష్ట్ర ప్రజలందరి ఆరోగ్యసేవలకు, జీవన భద్రతకు కట్టుబడి ఉన్నట్లు బడ్జెట్‌లో ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందులో భాగంగానే తొలిసారి రాష్ట్ర జనాభా మొత్తానికి వర్తింపజేసే కొత్త పథకాన్ని ప్రకటించింది. పేద, ధనిక అనే తేడా లేకుండా జనాభా మొత్తానికి వర్తించే సంక్షేమ పథకం ఇటీవలి కాలంలో అమల్లోకి రావడం ఇదే ప్రథమం. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద జీవిత బీమా కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని బడ్జెట్‌లో ప్రకటించడం ద్వారా అందరికీ ఇచ్చిన ప్రాధాన్యాన్ని చెప్పకనే చెప్పింది. చేయూత పథకానికి అర్హులైన వారికి 2 లక్షల నూతన పెన్షన్లను మంజూరు చేస్తామని వెల్లడించింది. కొత్తగా ప్రారంభించిన

తరువాయి 2లో

## రూ.40 వేల కోట్లతో రాష్ట్రంలో పీజీసీఐఎల్ నెట్‌వర్క్

- 53,400 మెగావాట్ల విద్యుత్ ట్రాన్స్‌మిషన్ లైన్లు
- ప్రాజెక్టుకు సీఈఆర్‌సీ ఆమోదం
- రాష్ట్రంలో 88వేల మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులు
- దక్షిణాది రాష్ట్రాల్లో ఏపీ కీలకం



అమరావతి: రాష్ట్రంలో విద్యుత్ ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్‌ను కేంద్ర విద్యుత్ సంస్థ పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (పీజీసీఐఎల్) విస్తరించనుంది. ఇందుకు రూ.40వేల కోట్లు ఖర్చు చేయనుంది. రానున్న నాలుగేళ్లలో (2026 27 నుంచి 202930 మధ్య) 53,400 మెగావాట్ల విద్యుత్ ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయనుంది. 2030 నాటికి దేశంలో 5 లక్షల మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్‌ను

తరువాయి 2లో

## దుబాయ్.. రిటర్న్స్..

- యుద్ధ మేఘాలతో అక్కడ తగ్గిన పెట్టుబడులు
- భారతీయ నగరాల మార్కెట్ల వైపు ఇన్వెస్టర్ల మొగ్గు
- అంచనా వేస్తున్న తెలంగాణ రియల్ ఎస్టేట్ సంఘాలు



2లో




## ఒత్తిడికి లొంగం

- యుద్ధ విమానాల ల్యాండింగ్ కోసం అమెరికా అభ్యర్థనకు శ్రీలంక నో
- ట్రంప్ వ్యూహాలకు దిసనాయకే బ్రేక్

కొలంబో: శ్రీలంకలోని మట్టాల అంతర్జాతీయ విమానాశ్రయంలో తమ రెండు యుద్ధ విమానాలను దించేందుకు అమెరికాకు శ్రీలంక అనుమతి నిరాకరించిందని అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే శుక్రవారం కొలంబోలోని పార్లమెంటులో తెలిపారు.

తరువాయి 2లో

## పంటనష్టం నివేదికలు 2 రోజుల్లో రూపొందించాలి



- వంటగ్యాస్ సరఫరా వ్యవస్థ దెబ్బతినకుండా చూడాలి
- అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి: అకాలవర్షాలతో జరిగిన పంటనష్టంపై రెండు రోజుల్లో పూర్తి స్థాయి అంచనాలు రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. పశ్చిమాసియాలో యుద్ధం

తరువాయి 2లో



## సాంకేతికతను వాడుకోవాలి

- పన్ను అధికారులకు ఆర్థిక మంత్రి సూచన

ఢిల్లీ: పన్ను చెల్లింపుదారులకు అత్యంత అనుకూల దేశంగా భారత్‌ను మార్చడమే తమ లక్ష్యమని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఆదాయపు పన్ను చట్టం 2025 అమల్లోకి వచ్చాక, ప్రజలకు ఎంతో సౌలభ్యంగా ఉంటుందని పేర్కొన్నారు. ''పన్ను చెల్లించడాన్ని సులభతరం చేయాలి. అప్పుడే నిజాయతీగా ప్రజలు పన్ను చెల్లిస్తారు. ఉద్దేశపూర్వకంగా పన్ను చెల్లించకుండా తప్పించుకునే వారిని, సాంకేతికత సాయంతో పట్టుకోవాలి. 'మీరు

తరువాయి 2లో

## మహిళాభ్యుదయం.. సామాజిక సంక్షేమం

- 10 కీలక హామీలతో టీఎంసీ మ్యానిఫెస్టో
- విడుదల చేసిన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత

కోల్‌కతా: రాష్ట్రంలో వరుసగా నాలుగోసారి అధికార పగ్గాలు చేజిక్కించుకోవడమే లక్ష్యంగా పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ప్రజలకు పలు వాగ్దానాలు చేశారు. ప్రతి ఇంట్లో ఆనందం నింపాలనే ఆశయంతో పనిచేస్తామని పేర్కొంటూ 10 కీలక హామీలతో పార్టీ మ్యానిఫెస్టోను ఆమె శుక్రవారం విడుదల చేశారు. సంక్షేమానికి, మహిళాభ్యుదయానికి అగ్ర ప్రాధాన్యమిచ్చారు. వ్యవసాయం,

తరువాయి 2లో



# రూ.40 వేల కోట్లతో రాష్ట్రంలో పీజీసీఐఎల్ నెట్‌వర్క్

అమరావతి: రాష్ట్రంలో విద్యుత్ ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్‌ను కేంద్ర విద్యుత్ సంస్థ పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (పీజీసీఐఎల్) విస్తరించనుంది. ఇందుకు రూ.40వేల కోట్లు ఖర్చు చేయనుంది. రానున్న నాలుగేళ్లలో (202627 నుంచి 202930 మధ్య) 53,400 మెగావాట్ల విద్యుత్ ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయనుంది. 2030 నాటికి దేశంలో 5 లక్షల మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. రాష్ట్రంలో విద్యుత్ ఎగుమతి విధానం కింద సుమారు 88,000 మెగావాట్ల సౌర, పవన, పంప్డ్ స్టోరేజీ (పీఎస్పీ) విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు జారీ చేసింది. వాటి ద్వారా ఉత్పత్తి చేసే విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేసేందుకు అంతర్రాష్ట్ర ట్రాన్స్‌మిషన్ సిస్టం (ఐఎస్‌టీఎస్)ను అభివృద్ధి చేయాల్సి ఉంది. ఇందులో భాగంగా గ్రీన్ ఎనర్జీ కారిడార్3 లో విద్యుత్ ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసేందుకు కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి (సీఈఆర్‌సీ) అనుమతి ఇచ్చింది. పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చిన ఆంధ్రప్రదేశ్‌తోపాటు.. రాజస్థాన్, గుజరాత్, కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్రల్లోనూ సరఫరా నెట్‌వర్క్‌ను విస్తరించాలని కేంద్రం నిర్ణయించింది.

**దక్షిణ భారతదేశంలో ఏపీ కీలకం**

దక్షిణాది రాష్ట్రాల్లో పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిలో ఏపీ కీలకమని కేంద్ర పునరుత్పాదక ఇంధన వనరుల శాఖ గుర్తించింది. మొత్తం 1,41,700 మెగావాట్ల సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు దక్షిణాది రాష్ట్రాలు అంగీకరిస్తే..అందులో 88,000 మెగావాట్ల ప్రాజెక్టులు మన రాష్ట్రంలోనే ఏర్పాటు కానున్నాయి. ఇందుకు అనుగుణంగా 38,400 మెగావాట్ల విద్యుత్ సరఫరా నెట్‌వర్క్‌ను పీజీసీఐఎల్ రాష్ట్రంలో అభివృద్ధి చేయనుంది. మరో 15,000 మెగావాట్ల నెట్‌వర్క్ విస్తరణకు ప్రతిపాదనలు రూపొందించింది. కర్ణాటకలో 31,240 మెగావాట్లు, తెలంగాణ 13,000 మెగావాట్లు, తమిళనాడులో 8,380 మెగావాట్ల సరఫరా నెట్‌వర్క్‌ను మాత్రమే కేంద్రం ఏర్పాటు చేస్తోంది. 202627లో జీఈసీ3 పథకం కింద రాష్ట్రంలో 11,000 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్‌ను సరఫరా చేసేందుకు అనువైన నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయాలన్నది లక్ష్యం. దీనికోసం 7,872 సర్క్యూట్ కి.మీ.లైన్లను పీజీసీఐఎల్ ఏర్పాటు చేయనుంది. సరఫరా లైన్లతో పాటు కర్నూలు (న్యూ), కర్నూలు 3, కర్నూలు 4, ఎన్‌పీ కుంట (అనంతపురం), అనంతపురం 3, కృష్ణగిరి (కర్నూలు)లో 765/400 పూలింగ్ సబ్ స్టేషన్లను పీజీసీఐఎల్ నిర్మించనుంది. ఒక్కొక్క సబ్‌స్టేషన్‌కు సగటున రూ.1,200 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా. పీజీసీఐఎల్ నెట్‌వర్క్ మొత్తం రాయలసీమలో ఏర్పాటు కానుంది. మెజారిటీ విద్యుత్ ప్రాజెక్టులు అక్కడ ఏర్పాటు కానుండటంతో.. అక్కడి నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా చేసేందుకు నెట్‌వర్క్ అవసరం.

*** డేటా సెంటర్లకు విద్యుత్ అవసరం**

విశాఖపట్నంలో గూగుల్, రిలయన్స్ ఒక్కొక్కటి 1,000 మెగావాట్ల సామర్థ్యం ఉన్న డేటా సెంటర్లను ఏర్పాటు చేస్తున్నాయి. వాటికి అవసరమైన విద్యుత్ సరఫరా చేసేందుకు ఇప్పటి నుంచే నెట్‌వర్క్ విస్తరణపై కేంద్రం దృష్టి పెట్టింది.

**రూ.21,500 కోట్లతో ట్రాన్స్‌కో నెట్‌వర్క్**

కేంద్ర ప్రభుత్వరంగ సంస్థకు సమాంతరంగా ట్రాన్స్‌కో రూ.21,500 కోట్లతో సరఫరా నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయనుంది. దీనిద్వారా 10,000 మెగావాట్ల విద్యుత్ సరఫరా నెట్‌వర్క్ అందుబాటులోకి రానుంది. దీనికోసం సుమారు 2 వేల సర్క్యూట్ కి.మీ. విద్యుత్ లైన్లు, 400 కె.వి.సబ్‌స్టేషన్లను ట్రాన్స్‌కో ఏర్పాటు చేయనుంది.

## సాంకేతికతను వాడుకోవాలి

ఢిల్లీ: పన్ను చెల్లింపుదారులకు అత్యంత అనుకూల దేశంగా భారత్‌ను మార్చడమే తమ లక్ష్యమని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఆదాయపు పన్ను చట్టం2025 అమల్లోకి వచ్చాక, ప్రజలకు ఎంతో సౌలభ్యంగా ఉంటుందని పేర్కొన్నారు. ''పన్ను చెల్లించడాన్ని సులభతరం చేయాలి. అప్పుడే నిజాయతీగా ప్రజలు పన్ను చెల్లిస్తారు. ఉద్దేశపూర్వకంగా పన్ను చెల్లించకుండా తప్పించుకునే వారిని, సాంకేతికత సాయంతో పట్టుకోవాలి. 'మీరు నిజాయతీగా ఉంటే, వ్యవస్థ మీ పనిని సులభతరం చేస్తుంది. పన్ను చెల్లించకుంటే మాత్రం మిమ్మల్ని కచ్చితంగా పట్టుకుంటుంది' అనే సందేశం ప్రజలకు స్పష్టంగా చేరాల''ని అధికారులకు మంత్రి సూచించారు. ఆదాయపు పన్ను చట్టం 2025పై జాతీయ స్థాయిలో ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమం 'ప్రారంభ్2026'లో ఆర్థికమంత్రి మాట్లాడారు. కొత్త పన్ను చట్టంపై ప్రజలకు వారి స్థానిక భాషల్లోనే అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి నిర్మల కోరారు. పన్ను సంబంధిత న్యాయపరమైన వ్యాజ్యాలను వీలైనంత వేగంగా తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. 'ట్రైబ్యునల్ లేదా కోర్టుకు వెళ్లే ప్రతి కేసూ మన వ్యవస్థ వైఫల్యాన్ని సూచిస్తుంది. అది మనందరికీ ఒక మచ్చలాంటిది' అని మంత్రి వ్యాఖ్యానించారు.

## మహిళాభ్యుదయం... సామాజిక సంక్షేమం

కోల్‌కతా: రాష్ట్రంలో వరుసగా నాలుగోసారి అధికార పగ్గాలు చేజిక్కించుకోవడమే లక్ష్యంగా పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ప్రజలకు పలు వాగ్దానాలు చేశారు. ప్రతి ఇంట్లో ఆనందం నింపాలనే ఆశయంతో పనిచేస్తామని పేర్కొంటూ 10 కీలక హామీలతో పార్టీ మ్యానిఫెస్టోను ఆమె శుక్రవారం విడుదల చేశారు. సంక్షేమానికి, మహిళాభ్యుదయానికి అగ్ర ప్రాధాన్యమిచ్చారు. వ్యవసాయం, సాంఘిక సంక్షేమం, వైద్య సేవలతోపాటు యువతకు వరాలు ప్రకటించారు. 'లక్ష్మీ భండార్ పథకం కింద జనరల్ కేటగిరీ మహిళలకు నెలకు రూ.1500, ఎస్సీ/ఎస్టీలకు రూ.1700 చొప్పున అందజేస్తాం. నిరుద్యోగులకు ప్రతి నెలా రూ.1500 సాయం అందిస్తాం. ఇంటి వద్దే నాణ్యమైన వైద్య సేవలు అందించేలా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తాం. రాష్ట్రంలోని పాఠశాలలను ఆధునికీకరించడంతో పాటు ఈ లెర్నింగ్ సదుపాయాలు కల్పిస్తాం. రూ.30వేల కోట్లతో ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశ పెడతాం. ప్రతి కుటుంబానికీ శాశ్వత ఇంటి నిర్మాణం చేపట్టడంతో పాటు ప్రతి ఇంటికీ శుద్ధి చేసిన తాగునీటి సరఫరా అందేలా చూస్తాం' అని మమత హామీ ఇచ్చారు. ప్రజల గడప వద్దే ఆరోగ్య సేవలు అందించే ''ద్వారే చికిత్స'' పథకం కింద వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు.

*** అన్ని మతాల ప్రజలూ నాకు సమానమే: దీదీ**

పశ్చిమ బెంగాల్ ఎన్నికల అనంతరం ఎన్‌ఆర్‌సీ, జనగణన పేరుతో ప్రజల పౌరసత్వాన్ని తొలగించేందుకు కేంద్రం ప్రణాళికలు రచిస్తోందని మమతా బెనర్జీ ఆరోపించారు.. మ్యానిఫెస్టో విడుదల అనంతరం ఆమె మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో భాజపా గెలుపునకు సహకరించేలా కేంద్రం, ఈసీ నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణకు ప్లాన్ చేస్తున్నాయన్నారు. తాను విభజన రాజకీయాలు చేయడంలేదని, అన్ని మతాల ప్రజలూ తనకు సమానమేనని తెలిపారు.

## పంటనష్టం నివేదికలు 2 రోజుల్లో రూపొందించాలి

అమరావతి: అకాలవర్షాలతో జరిగిన పంటనష్టంపై రెండు రోజుల్లో పూర్తిస్థాయి అంచనాలు రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. పశ్చిమాసియాలో యుద్ధం మరికొన్నాళ్లు కొనసాగితే ఎల్‌పీజీ సరఫరా వ్యవస్థ దెబ్బతినే ప్రమాదం ఉందని, దాన్ని ఎదుర్కొనేలా సమర్థ విధానాలు అమలు చేయాలని స్పష్టం చేశారు. అకాల వర్షాలతో పంటనష్టం, ఎల్‌పీజీ సరఫరాపై శుక్రవారం చంద్రబాబు తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. '12 జిల్లాల్లోని 42 మండలాల్లో 4,840 హెక్టార్లలో మొక్కజొన్న, 1,534 హెక్టార్లలో వరి, 310 హెక్టార్లలో మినుము పంటలకు రూ.40 కోట్ల మేర నష్టం జరిగింది. 9 జిల్లాల్లోని 48 మండలాల్లో 1,301 హెక్టార్లలో అరటి, బొప్పాయి, మిరప, కూరగాయలు, మామిడి, బత్తాయి, నిమ్మ తదితర ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. దీని విలువ రూ.23 కోట్లు ఉంటుంది. మొత్తంగా రూ.63 కోట్ల నష్టం వాటిల్లింది' అని అధికారులు సీఎంకు ప్రాథమిక అంచనాలు వివరించారు.

## మూసీపై ముందుకే.. రాజీ లేదు

హైదరాబాద్: ''మొయినాబాద్ ఫాం హౌస్ డ్రగ్స్ కేసులో పోలీసులపై కాల్పులు జరిగినా.. భాజపా నేతలు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రామచందర్‌రావు ఎందుకు నోరు మెదపలేదు? అయిన దానికి, కాని దానికి స్పందించే భాజపా నాయకులు.. భారాస మాజీ ఎమ్మెల్యే ఫాంహౌస్‌లో ఇంత పెద్ద ఘటన జరిగినా ఎందుకు మాట్లాడలేకపోతున్నారు? ఆ రెండు పార్టీలు ఒకటేనని చెప్పడానికి ఇది నిదర్శనం కాదా?'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ''భారాస హయాంలో దాదాపు 6 వేల ఫోన్లను ట్యాపింగ్ చేసినట్లు ఆరోపణలున్నాయి. ఈ కేసు విచారణలో ప్రభాకర్‌రావు అందుబాటులో లేకపోవడంతో.. 20 నెలలు ఆలస్యమైంది. ఆయనిచ్చిన వివరణ ద్వారా బాధితులను పిలిపించి విచారిస్తున్నాం. ఎవరినైనా బెదిరించారా? ఒత్తిడి చేశారా? ఆర్థికంగా లబ్ధి పొందారా? అన్నది విచారణలో తేలుతుంది. తర్వాతే కేసు ఫైల్ చేస్తారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో తనకు క్లీన్ చిట్ వచ్చిందని హరీశ్‌రావు చెబుతున్నారు. తన ఫోన్ ట్యాప్ చేసి.. వేధింపులకు పాల్పడ్డారని సిద్దిపేటకు చెందిన వ్యక్తి చేసిన ఫిర్యాదుపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వేధించినట్లుగా హరీశ్‌రావుపై దర్యాప్తులో రుజువులు చూపలేకపోయారు. దీంతో సుప్రీంకోర్టు కేసు కొట్టేసింది. ఇదో ప్రైవేటు కేసు. దీనికి.. ప్రభుత్వం జరుపుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధం ఏమిటి?'' అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ''ఈకార్ రేస్ కేసులో.. ఐఏఎస్‌పై చర్యలకు డీవోపీటీ అనుమతించడంతో సస్పెండ్ చేశాం. దాని విచారణా కొనసాగుతోంది. అలాంటపుడు నేనేమీ మాట్లాడను. మీకో.. నాకో.. వాళ్లను తొందరగా లోపలేయాలని ఉంటే.. అలా చేయడానికి వీల్లేదు. చట్టప్రకారం ముందుకెళ్లాల్సిందే'' అని సీఎం స్పష్టం చేశారు. శాసనమండలి మీటింగ్ హాలులో శుక్రవారం నిర్వహించిన ఇష్టాగోష్ఠిలో మీడియాతో పలు అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడారు.

## దుబాయ్.. రిటర్న్స్..

మధ్యప్రాచ్యంలో నెలకొన్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలతో దుబాయ్ వంటి నగరాల్లో రియల్ ఎస్టేట్ పెట్టుబడులు తగ్గుముఖం పట్టాయి. ఈ పరిస్థితి భారతీయ రియల్ ఎస్టేట్ మార్కెట్‌కు, ప్రత్యేకించి హైదరాబాద్ లాంటి నగరానికి లాభిస్తుందని స్థిరాస్తి సంఘాలు అంచనా వేస్తున్నాయి. దుబాయ్ రియల్ ఎస్టేట్‌లో విదేశీయులు కొన్నేళ్లుగా పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టారు. 2025లో అత్యధికంగా భారతీయులే రూ.8500095000 కోట్ల మధ్య పెట్టుబడి పెట్టినట్లు నివేదికలు వెల్లడించాయి. పన్ను రహిత అద్దె ఆదాయం, మెరుగైన రాబడి, పది సంవత్సరాల నివాస అవకాశం కల్పించే గోల్డెన్ విసా, విలాసవంతమైన జీవనశైలి వంటి కారణాలతో మనవాళ్లు ఎక్కువ ఆకర్షితులయ్యారు. హైదరాబాద్‌లోని స్టార్‌హోటల్స్‌లో తరచూ దుబాయ్ ప్రాపర్టీ షోలు నిర్వహించి మరీ పెట్టుబడిదారులను ఆకట్టుకోగల్గారు. దీంతో మన వాళ్లు భారీగా అక్కడికి తరలిపోవడంతో భారతీయ స్థిరాస్తి మార్కెట్లు కొంతకాలంగా డీలా పడ్డాయి. పరిస్థితిని గమనించిన మన బిల్డర్లు సైతం కొందరు దుబాయ్ మార్కెట్లోకి ప్రవేశించారు. అక్కడ వ్యాపారం చేయడం మొదలెట్టారు. ఐదేళ్లలో స్థిరాస్తి ధరలు రెట్టింపైన పరిస్థితులు ఉన్నాయి. రాబడి ఒక్కటే కాకుండా దుబాయ్ వంటి నగరాల్లో విలువైన ఆస్తి ఉండాలనే కారణంతో వ్యాపారస్తులు ఎక్కువగా అక్కడ కొనుగోలు చేశారని బిల్డర్ ఒకరు అన్నారు. ఇప్పుడు బ్రాండ్ దుబాయ్‌కి ముప్పు ఏర్పడింది. సురక్షితమైన నగరం అనే నమ్మకం చెదిరింది. అమెరికా, ఇజ్రాయెల్ ఇరాన్ మధ్య యుద్ధం మొదలైన మొదటివారంలోనే ఆస్తి కొనుగోలు లావాదేవీల సంఖ్య 50 శాతానికి పడిపోయిందని దుబాయ్ ల్యాండ్ డిపార్ట్‌మెంట్ గణాంకాలు చెబుతున్నాయి.

**సురక్షిత మార్కెట్ల వైపు చూపు...**

యుద్ధ భయాల కారణంగా మధ్యప్రాచ్య దేశాల్లోని మార్కెట్లలో ఆందోళన పెరిగింది. యుద్ధ మేఘాలు కమ్ముకున్న ప్రాంతాల్లో పెట్టుబడులను ఉంచడానికి ఇష్టపడటం లేదు. భారతీయులు తమ సంపదకు రక్షణగా ఉండే నగరాల వైపు చూస్తున్నారు. ఈ క్రమంలో స్వదేశీ మార్కెట్ అత్యంత సురక్షితమైనదిగా ఎక్కువ మందికి కన్పిస్తోంది. ఇక్కడ పెట్టుబడులు పెట్టడమే మేలనే భావన భారతీయుల్లో ఏర్పడింది.

**మనకు సానుకూలం..**

స్థిరమైన రియల్ ఎస్టేట్ ఆస్తులపై పెట్టుబడితో దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉంటాయని ప్రవాస భారతీయులు భావిస్తున్నారు. హైదరాబాద్ లాంటి మార్కెట్లు వారికి ఆశాజనకంగా కన్పిస్తున్నాయని నిర్మాణ సంఘాలు అంటున్నాయి. హైదరాబాద్‌లో ఐటీ, ఫార్మా రంగాలు బలంగా ఉండటంతోపాటు భౌగోళికంగా, వాతావరణ పరంగా సానుకూల అంశాలు ఎన్నో ఉన్నాయి. ఓఆర్ఆర్, అంతర్జాతీయ విమానాశ్రయం, ప్రాంతీయ వలయ రహదారి, మెట్రో విస్తరణ, ఫ్యూచర్‌సిటీ వంటి ప్రాజెక్టులతో నగరం మరింతగా విస్తరిస్తూ పెట్టుబడిదారులను ఆకర్షిస్తోంది. గల్ఫ్ దేశాలతో పోలిస్తే ఇక్కడ ఆస్తుల విలువ పెరగడమే కాకుండా అద్దెల ఆదాయం కూడా మెరుగ్గా వస్తోంది. దుబాయ్‌లో ఆగిపోయిన పెట్టుబడులు ఇప్పుడు హైదరాబాద్‌లోని అల్ట్రా లగ్జరీ అపార్ట్‌మెంట్లు, విల్లాల వైపు మళ్లే అవకాశం ఉందని బిల్డర్లు అంటున్నారు.

## సంక్షేమానికి నవోదయం

హైదరాబాద్: సంక్షేమం, అభివృద్ధి పథకాల జోడు గుర్రాల సవారీకి కొత్త బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. నూతనంగా... తొమ్మిది సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టింది. ఇంతకాలం సంక్షేమం అంటే పేదలకే అనే భావన ఉండగా.. రాష్ట్ర ప్రజలందరి ఆరోగ్యసేవలకు, జీవన భద్రతకు కట్టుబడి ఉన్నట్లు బడ్జెట్‌లో ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందులో భాగంగానే తొలిసారి రాష్ట్ర జనాభా మొత్తానికి వర్తింపజేసే కొత్త పథకాన్ని ప్రకటించింది. పేద, ధనిక అనే తేడా లేకుండా జనాభా మొత్తానికి వర్తించే సంక్షేమ పథకం ఇటీవలి కాలంలో అమల్లోకి రావడం ఇదే ప్రథమం. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద జీవిత బీమా కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని బడ్జెట్‌లో ప్రకటించడం ద్వారా అందరికీ ఇచ్చిన ప్రాధాన్యాన్ని చెప్పకనే చెప్పింది. చేయూత పథకానికి అర్హులైన వారికి 2 లక్షల నూతన పెన్షన్లను మంజూరు చేస్తామని వెల్లడించింది. కొత్తగా ప్రారంభించిన అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సంస్థ(ఏటీసీ)ల్లో చేరేవారికి నెలకు రూ.రెండువేల ఉపకార వేతనం ఇవ్వాలనే మరో కీలక పథకాన్ని ప్రకటించింది. దీనిద్వారా ఏటీసీల్లో ఎక్కువ మంది చేరేలా ఆకర్షించాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఈ సంస్థల్లో చేరినవారు... వృత్తి నైపుణ్యాలు సాధిస్తే వారికి ఉద్యోగాలు రావడం లేదా స్వయం ఉపాధి సంస్థల ఏర్పాటుతో జీవనోపాధికి అవసరమైన మార్గం కల్పించాలని ఈ కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. ఎంపిక చేసిన ప్రస్తుత ప్రభుత్వ పాఠశాలలను అన్ని వనరులతో కూడిన తెలంగాణ పబ్లిక్ స్కూళ్లుగా మార్పు చేయనున్నట్లు తెలిపింది. వాటిల్లో ప్రీ ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు విద్య అందుతుందని వివరించింది. ప్రీప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు నూతనంగా బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభిస్తామని వివరించింది. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రకటించింది. ప్రభుత్వ ఉద్యోగులు.. పెన్షనర్లు, వారి కుటుంబాలకు వైద్యసేవలను అందించే ప్రత్యేక పథకాన్ని అమలు చేస్తామని పేర్కొంది. ఉద్యోగులు.. పెన్షనర్లకు ప్రమాద బీమా పథకం అమలు చేస్తామని తెలిపింది. రాష్ట్ర యువతకు వివిధ రంగాలలో తగిన నైపుణ్య శిక్షణ అందించడానికి.. వారికి ఉపాధి లభించిన దేశాల భాషను నేర్పించడానికి ఉద్దేశించిన సీఎం ఓవర్సీస్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రామ్‌ను ప్రకటించింది. అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటుచేస్తున్న యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూళ్లకు ఏకంగా రూ. 5 వేల కోట్లు కేటాయించింది. పేదలకు నాణ్యమైన విద్యను అందించడం ద్వారా వారి జీవితాల్లో అక్షర వెలుగులు నింపాలని సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా తానే మంత్రిగా ఉన్న విద్యారంగానికి బడ్జెట్‌లో అత్యంత ప్రాధాన్యమిచ్చారు.

*** మారుమూల పల్లెలు మొదలుకుని రాజధాని వరకు...**

రాష్ట్రవ్యాప్తంగా రవాణా సదుపాయాలను మెరుగుపరచాలని రోడ్ల నిర్మాణం, మరమ్మతులకు భారీగా నిధులు కేటాయించింది. మూసీ కాలుష్యం నుంచి రాజధానివాసులకు విముక్తి కల్పించాలనే సంకల్పంతో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం 'మూసీ రివర్‌ఫ్రంట్ పథకానికి' నిధులు కేటాయించింది. మెట్రో విస్తరణ రెండో దశ పనులకు బడ్జెట్‌లో తొలిసారి నిధుల కేటాయింపుతో నగర రవాణా వ్యవస్థ మెరుగుకు భరోసా దక్కింది. రాష్ట్ర ప్రజలందరికీ హెల్త్ ప్రొఫైల్‌తో డిజిటల్ హెల్త్ కార్డులను అందజేయాలని సర్కారు సంకల్పించింది.

**సంక్షేమ పథకాలకు 44.90 శాతం**

గత బడ్జెట్‌లో అన్ని రకాల సంక్షేమ పథకాలకు కలిపి రూ.1.04 లక్షల కోట్లు కేటాయిస్తే వచ్చే ఏడాదికి ఈ పద్దు కింద రూ.1,45,591 కోట్లను ప్రతిపాదించింది. మొత్తం బడ్జెట్ వ్యయంలో సంక్షేమ పథకాలకు కేటాయింపులు 44.90% కాగా.. గత బడ్జెట్‌లో ఇది 34.21 %. దీనిని 10%పైగా పెంచడం ద్వారా సంక్షేమ పథమే తమ ధ్యేయమని రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో స్పష్టం చేసింది. మొత్తం 69 రకాల సంక్షేమ పథకాలను వివిధ శాఖల్లో అమలుచేస్తున్నారు.

*** మూలధన వ్యయం పెంపుతో అభివృద్ధికి ప్రాధాన్యం**

మూలధన వ్యయ పద్దును ప్రభుత్వం రూ.36,504 కోట్ల నుంచి రూ.47,267 కోట్లకు భారీగా పెంచింది. ఏకంగా 29.40 శాతం పెంపును బడ్జెట్‌లో ప్రతిపాదించడం రాష్ట్ర అభివృద్ధికి ఉపకరిస్తుందని అంచనా. మొత్తం 28 ప్రభుత్వ శాఖల పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులకు వీటిని ఖర్చుచేయాలని ప్రతిపాదించారు. గ్యారంటీ హామీలకు సంబంధించిన సంక్షేమ పథకాలకు వచ్చే ఏడాదికి రూ.50,713 కోట్ల కేటాయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(202526) కోసం గత బడ్జెట్‌లో వేసిన రూ.3.04 లక్షల కోట్ల అంచనాలకన్నా ఆదాయం రూ.23,626 కోట్లు తగ్గింది. దీనిప్రకారం సవరించిన అంచనాలతో ఈ ఏడాది బడ్జెట్ ఆదాయం రూ.2.81 లక్షల కోట్లకు తగ్గిపోయింది. అయినా ప్రభుత్వం మరిన్ని భారీ ఆదాయ లక్ష్యాలతో.. సుమారు రూ.43 వేల కోట్లు పెంచి రూ.3.24 లక్షల కోట్ల కొత్త బడ్జెట్‌ను రూపొందించింది. ఆదాయం పెరుగుతుందన్న నమ్మకంతోనే అంతే మొత్తం ఖర్చుచేస్తామని కొత్త బడ్జెట్‌లో ప్రభుత్వం స్పష్టం చేసింది.

## ఒత్తిడికి లొంగం

కొలంబో: శ్రీలంకలోని మట్టాల అంతర్జాతీయ విమానాశ్రయంలో తమ రెండు యుద్ధ విమానాలను దించేందుకు అమెరికాకు శ్రీలంక అనుమతి నిరాకరించిందని అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే శుక్రవారం కొలంబోలోని పార్లమెంటులో తెలిపారు. ఎర్ర సముద్రం, ఏడెన్ గల్ఫ్‌ల మధ్య కీలకమైన సముద్ర మార్గమైన జిబౌటిలో ఉన్న అమెరికా యుద్ధ విమానాల నుంచి మార్చి 4, 8 తేదీల్లో ఈ అభ్యర్థనలు రాగా..ఆ రెండింటినీ తిరస్కరించామన్నారు. "జిబూటీలోని స్థావరం నుంచి ఎనిమిది నౌకా విధ్వంసక క్షిపణులతో కూడిన రెండు యుద్ధ విమానాలను మట్టాల అంతర్జాతీయ విమానాశ్రయానికి తీసుకురావాలని అమెరికా కోరింది. కానీ మేం నిరాకరించాం" అని ఆయన అన్నారు. అదే విధంగా "ఎన్నో ఒత్తిళ్లు ఉన్నప్పటికీ మేం మా తటస్థతను కొనసాగించాలనుకుంటున్నాం. మధ్యప్రాచ్య యుద్ధం సవాళ్లను విసురుతోంది. కానీ మేం లొంగిపోం. " అని దిసనాయకే అన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న పశ్చిమాసియా సంఘర్షణలోకి లాగబడకుండా ఉండాలన్న కొలంబో ఉద్దేశాన్ని ఆయన ఈ విధంగా స్పష్టం చేశారు. దక్షిణ, మధ్య ఆసియాకు అమెరికా ప్రత్యేక రాయబారి సెర్గియో గోర్‌తో సమావేశమైన తర్వాత దిసనాయకే ఈ వ్యాఖ్యలు చేశారు. అధికారిక ప్రకటన ప్రకారం.. కీలకమైన సముద్ర మార్గాలను పరిరక్షించడం, ఓడరేవులను సురక్షితం చేయడం, వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడం, స్వేచ్ఛాయుత, బహిరంగ ఇండో పసిఫిక్‌ను ముందుకు తీసుకెళ్లడంపై చర్చలు జరిగాయి. అయితే ఈ చర్చలు జరిగినప్పటికీ, తమ తటస్థ వైఖరికి భంగం కలిగించే బాహ్య ఒత్తిళ్లను ప్రతిఘటిస్తామని శ్రీలంక నాయకత్వం సంకేతాలు ఇచ్చింది. హిందూ మహాసముద్ర ప్రాంతమంతటా, ముఖ్యంగా మధ్యప్రాచ్య సంఘర్షణ యొక్క దుష్ప్రభావాల కారణంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న తరుణంలో, శ్రీలంక అనుసరిస్తున్న జాగ్రత్తతో కూడిన సమతుల్య చర్యను ఈ తిరస్కరణ స్పష్టం చేస్తుంది. అమెరికా సైనిక విమానాలకు ఆతిథ్యం ఇవ్వకూడదని కొలంబో తీసుకున్న నిర్ణయం, సైనిక కార్యకలాపాలలో చిక్కుకుపోతామనే లేదా ఒక పక్షానికి వత్తాసు పలుకుతున్నట్టుగా ప్రజలు భావిస్తారనే ఆందోళనలను ప్రతిబింబిస్తుంది.

**వివాదంలో ఐరిస్ దేనా**

హిందూ మహాసముద్రంలో శ్రీలంక దక్షిణ తీరంలో ఇటీవల ఒక సముద్ర ప్రమాదం నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. మార్చి 4న, గాలే సమీపంలో ఒక అమెరికా జలాంతర్గామి ఇరాన్ ఫ్రిగేట్ 'ఐరిస్ దేనా'పై టార్పెడో దాడి చేసింది. ఈ ఘటనలో 84 మంది నావికులు మరణించారు. మరో 32 మందిని శ్రీలంక నావికాదళం రక్షించింది.



## రక్తదాన శిబిరంలో పాల్గొన్న వేములకొండ సోమశేఖర్ గౌడ్



మేడ్చల్ జిల్లా, ప్రజాస్ఫూర్తి : భారతీయ జనతా పార్టీ కేంద్ర కార్యవర్గ సభ్యులు, మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన నివాసం లో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి ఓబీసీ మోర్చా పూర్వ అధికార ప్రతినిధి వేములకొండ సోమశేఖర్ గౌడ్ రక్తదాన శిబిరం లో పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్, ఉప్పల్ మాజీ శాసనసభ్యులు ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఎంతోమంది పేదవారికి, ఆపదలో ఉన్న వారికి సహాయపడుతుందని అన్నారు. రక్తదానం చేసినటువంటి రాష్ట్ర బిజెపి ఓబీసీ మోర్చా పూర్వ అధికార ప్రతినిధి వేములకొండ సోమశేఖర్ గౌడ్ ను అభినందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో హబ్సిగూడ డివిజన్ నాయకులు జిల్లాల రవీందర్ రెడ్డి, బొమ్మగాని రఘుపతి గౌడ్ ,అల్కాపురి సురేష్ పటేల్, కట్ట భాస్కర్ , బానోతు రమేష్ నాయక్ తదితరులు పాల్గొనడం జరిగింది,

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు డిక్షనరీల పంపిణీ



ప్రజాస్ఫూర్తి/జన్నారం : జన్నారం మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన సీదార్ల రామ్మోహన్ తహసిల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న సీదార్ల ఉదయ్ కుమార్ లు శుక్రవారం మండలంలోని కిష్టాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు డిక్షనరీలను పంపిణీ చేశారు. విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడే డిక్షనరీలను పంపిణీ చేసిన వారిద్దరిని పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుధాకర్ నాయక్,శెట్టి రాజశేఖర్, ఉపాధ్యాయులు లక్ష్మయ్య, నాగలక్ష్మి, గీత, స్వరూప, వెన్నెల, అంగన్వాడి టీచర్లు స్వరూప ,వనిత తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యం చేయాలి



ప్రజాస్ఫూర్తి/ జన్నారం : వైద్యులు, వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సమయపాలన పాటించాలని మంచిర్యాల జిల్లా డిప్యూటీ డిఎంహెచ్వో సుధాకర్ నాయక్ అన్నారు.శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా టిబి, ఎన్సిడి, లెప్రసీ, మలేరియా మొదలగు వ్యాధుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. వేసవి కాలంలో వడదెబ్బ తగలకుండా ఓఆర్ఎస్ సరఫరా చేయాలని సూచించారు.రికార్డులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## అమలు కాని హామీలు... మోసపోతున్న ప్రజలు




మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అసాధ్యమైన హామీలు ప్రజలకు శాపంగా మారాయని బిఆర్ఎస్ పార్టీ శాసనమండలి సభ్యులు మధుసూదనాచారి,ఎల్ రమణ, తక్కలపల్లి రవీందర్ రావు ధ్వజమెత్తారు.శుక్రవారం గన్ పార్క్ వద్ద అమరవీరుల స్తూపం సాక్షిగా నిరసన చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ పార్టీ శ్రేణులు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రధానంగా రైతులకు ఇస్తామన్న రూ. 15,000 రైతు భరోసా ఏమైందని ప్రశ్నించారు. గడిచిన 27 నెలల కాలంలో రైతులకు చెల్లించాల్సిన బాకీ ఎక్కడ అని నిలదీశారు. నెలకు రూ. 2,500 ఇస్తామన్న మహాలక్ష్మి పథకం అమలు కాకపోవడంతో మహిళలు తీవ్ర నిరాశలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. “చేయి చూపి ముంచిన కాంగ్రెస్” అంటూ నిరసనకారులు ప్లకార్డులతో హోరెత్తించారు. ప్రతి హామీని బేషరతుగా అమలు చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజల పక్షాన బిఆర్ఎస్ పార్టీ పోరాటాన్ని ఉధృతం చేస్తుందని హెచ్చరించారు.అమరవీరుల త్యాగాలతో ఏర్పాటైన తెలంగాణలో ప్రజలను వంచించే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేశారు.

# ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ ఆదర్శనీయం

*** సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**

ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేయడం ఆదర్శనీయమని, పండుగ వేళ పేదల ముఖాల్లో చిరునవ్వులు నింపడం సంతోషకరమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని శుక్రవారం కొత్తగూడెం పట్టణ పరిధిలోని రామవరం 2 ఇంక్లైన్ గ్రామపంచాయతీ, వనందాస్ గడ్డ ఏరియాల్లో నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. శ్యామల గోపాలం ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సహకారంతో సిపిఐ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై నిరుపేదలకు కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ రంజాన్ మాసం క్రమశిక్షణ, దాతృత్వం, మానవతా విలువలను నేర్పుతుందని పేర్కొన్నారు. ఆకలి విలువ తెలిసేలా ఉపవాస దీక్షలు చేస్తూ, సంపాదనలో కొంత భాగాన్ని పేదలకు దానం చేయడం ఈ పండుగ విశిష్టత అని వివరించారు. సమాజంలో వెనుకబడిన వర్గాలను ఆదుకోవడానికి శ్యామల గోపాలం ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ట్రస్టు, తాండ్ర నారాయణ రావు (టిఎన్ఆర్) ట్రస్టు వంటి సంస్థలు ముందుకు రావడం శుభపరిణామమని, ప్రతి ఒక్కరూ ఇటువంటి సేవా కార్యక్రమాల్లో



భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నయీమ్ ఖురేషి, షేక్ ఫహీమ్ దాదా, గోపి కష్ణ, తూముల శ్రీనివాస్, అరుణ, సింగిరాల రమేష్, నగేష్, అంకుష్ తదితరులు పాల్గొన్నారు.

## థాను నాయక్ పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శం

**– కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ గణేష్ నాయక్**



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి పోరాడిన బంజారా తెగకు చెందిన జాటోత్ థాను నాయక్ జీవిత గాథ ప్రతీ ఒక్కరికి ఆదర్శనీయమని కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ నాయక్ అన్నారు. ప్రజలను సంఘటితం చేసి భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమించారని గుర్తుచేశారు. థాను నాయక్ 76వ వర్ధంతి సందర్భంగా బంజారా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ వైస్ చైర్మన్ బానోత్ వీరు నాయక్ ఆధ్వర్యంలో లక్ష్మీదేవిపల్లి మండలంలో శుక్రవారం నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో గణేష్‌నాయక్ పాల్గొని థాను నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు అజ్మీరా లైలా, గుగులోత్ ప్రేమిందర్, హాతీరాం, కార్పొరేటర్ సింధు తపస్వి, జేఏసీ గౌరవాధ్యక్షులు రమేష్ రాథోడ్, బానోత్ రాములు, సాధులు గణేష్ మహరాజ్, రాములు మహరాజ్, జేఏసీ ప్రధాన కార్యదర్శులు ధరావత్ కన్షీరామ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్య రాంబాబు, మహిళా కో-కన్వీనర్ జానకి బాయి తదితరులు పాల్గొన్నారు.

## విద్యా రంగానికి పెద్దపీట వేసిన రాష్ట్ర బడ్జెట్

*** ఎన్.ఎస్.యూ.ఐ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ మీడిదొడ్డి భాను కుమార్**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: విద్యా రంగానికి రాష్ట్ర బడ్జెట్ లో పెద్దపీట వేయడం అభినందనీయమని ఎన్.ఎస్.యూ.ఐ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ మీడిదొడ్డి భాను కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ పై ఆయన స్పందిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మీడిదొడ్డి భాను కుమార్ మాట్లాడుతూ విద్యా రంగానికి 26,674 కోట్ల రూపాయలు కేటాయించడం విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో దోహద పడుతుందని వివరించారు. ముఖ్యంగా ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రవేశపెట్టడం, డిప్లొమా, ఐటీఐ విద్యార్థులకు ప్రతి నెల 2000 రూపాయల స్కాలర్‌షిప్ ప్రకటించడం వంటి నిర్ణయాలు చారిత్రాత్మకమని కొనియాడారు. ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధికి 1000 కోట్ల రూపాయలు కేటాయించడం వల్ల మౌలిక వసతులు మెరుగుపడతాయని తెలిపారు. యువత ఉపాధి కోసం 'రాజీవ్ యువ వికాసం' పథకానికి 6000 కోట్ల రూపాయలు కేటాయించడం శుభపరిణామమని, ఇలాంటి ప్రజాహిత నిర్ణయాలు విద్యార్థులకు, యువతకు అండగా నిలుస్తాయని భాను కుమార్ పేర్కొన్నారు.

## మైనార్టీలకు కేటాయించిన బడ్జెట్ ను మైనార్టీలకే, ఖర్చు చేయాలి

*** రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ, తెలంగాణ ముస్లిం సంఘాల జేఏసీ నాయకుడు అహ్మద్ ఖాన్**



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రజాస్ఫూర్తి: మైనార్టీలకు కేటాయించిన బడ్జెట్ ను మైనార్టీలకే ఖర్చు చేయాలని రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ, తెలంగాణ ముస్లిం సంఘాల జేఏసీ నాయకుడు అహ్మద్ ఖాన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం 3,000 కోట్లు మైనార్టీ సంక్షేమానికి కేటాయించిన బడ్జెట్లో కేవలం 700, 800 కోట్లు మాత్రమే ఖర్చు చేయడం జరిగిందన్నారు. ఆ ఖర్చు కూడా మైనార్టీ కార్పొరేషన్,వక్ఫ్ బోర్డు,ఉర్దూ అకాడమీ,సంస్థల, ఇమామ్, మౌజన్ ల జీతభత్యాలకు, షాది ముబారక్ పథకానికి ఖర్చు చేసిందే తప్ప, ముస్లింల అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదన్నారు.ఆ బడ్జెట్ నుండే ముస్లింలకు అవసరంలేని ఇఫ్తార్ విందు పేరిట రెండేళ్లలో దాదాపు 150 కోట్ల రూపాయలు వృధా ఖర్చు చేసింది.ఇఫ్తార్ విందు పేరిట ఖర్చు చేసిన 150కోట్లతో ఒక్కొక్క ముస్లిం యువకునికి లక్ష రూపాయలు రుణాలు ఇచ్చినా,దాదాపు 15 వేల మంది పేద ముస్లింలకు లాభం చేకూర్చేదన్నారు. ముస్లింలకు కేటాయించిన నిధులను వృధా ఖర్చులు చేస్తూ, దారి మళ్లిస్తూ, బడ్జెట్లో మాత్రం గొప్పగా కేటాయిస్తున్నట్లు, మైనార్టీ సంక్షేమానికి తాము కట్టుబడి ఉన్నట్టు ప్రభుత్వం చెప్పుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ బడ్జెట్లో 3,700 కోట్ల రూపాయలకు పైగా కేటాయించిన నిధులను “నిరుద్యోగ ముస్లిం యువకులకు రుణాలు ఇచ్చి వాళ్ళ అభివృద్ధికి” తోడ్పడాలని, మైనార్టీలకు కేటాయించిన బడ్జెట్ పూర్తిస్థాయిలో మైనార్టీలకే ఖర్చు చేయాలని కోరుతున్నాము.

## ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆశా వర్కర్లు ర్యాలీ



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రజాస్ఫూర్తి: ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆశా వర్కర్లు శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మార్వో ఆఫీస్ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ కన్వీనర్ పుచ్చకాయల రజని, జంపాల సరిత మాట్లాడుతూ గత ప్రభుత్వ హాయంలో మా ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మార్వో ఆఫీసు ముందు కలెక్టర్ ఆఫీస్ ల ముందు రోడ్ల పైన టెంటులు వేసుకొని ధర్నాలు, సమ్మెలు చేస్తుంటే మీ ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యేలు, మంత్రులు టెంట్ల వద్దకు వచ్చి మా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆశా వర్కర్లకు ఫిక్స్డ్ వేతనం 18 వేల రూపాయలు, దహన ఖర్చులకు 50 వేలు, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తామని అన్నారు. ఎన్నికలలో హామీలు ఇవ్వడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి సుమారు మూడు సంవత్సరాలైనా ఇప్పటివరకు ఆశా వర్కర్ల స్థితిగతులు మారలేదు హామీలు నెరవేరలేదని అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలోనైనా మాట్లాడి ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఏఎన్సీ టార్గెట్ ఎత్తివేయాలని పెండింగ్ లో ఉన్న ఎల్సిడిసి సర్వే ల బకాయిలు చెల్లించాలని, అర్హులైన ఆశాలను ఏ ఎన్ యం లుగా నియమించాలని, ఈఎస్ఐ,పిఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రేషపల్లి నవీన్, సిఐటియు ఉపాధ్యక్షులు కుమ్మరి కుంట్ల నాగన్న, ఏఐటీయూసీ నాయకులు మంద శంకర్, వెలుగు శ్రవణ్, ఉపేంద్ర,సుకన్య, మాధవి,చంద్రకళ, మమత,లక్ష్మి జ్యోతి అందాల చంద్రకళ, మహేశ్వరి, మంగ, పుష్ప,ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా ప్రారంభమైన రైతు మేళా – వేలాదిగా తరలివచ్చిన రైతులు



సిద్దిపేట జిల్లా, ప్రజాస్ఫూర్తి : నంగునూరు మండలం నర్మెట్ట ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీలో రైతు మేళా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి రైతులు భారీగా తరలివచ్చి ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను రైతులు ఆసక్తిగా పరిశీలిస్తూ, తమకు అవసరమైన సమాచారాన్ని సేకరించారు. మొదటి రోజే సుమారు 5 వేల మంది రైతులు హాజరైనట్లు అధికారులు తెలిపారు. మొత్తం మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ మేళాలో 150 స్టాళ్లు ఏర్పాటు చేశారు. వ్యవసాయం, హార్టికల్చర్, పశుసంవర్ధక, ఫిషరీస్, నాబార్డ్, విజయ డైరీ, బ్యాంకింగ్, సహకార శాఖలతో పాటు అనేక వ్యవసాయ టెక్నాలజీ సంస్థలు ఇందులో పాల్గొన్నాయి. ప్రతి స్టాల్‌లో రైతులకు ఉపయోగపడే పరికరాలు, ఆధునిక నమూనాలు, లైవ్ స్టాక్ ప్రదర్శనలు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ మేళా 19వ తేదీన ప్రారంభమై 22వ తేదీ వరకు కొనసాగనున్నదని నిర్వహకులు తెలిపారు.

## ఖమ్మం జిల్లాలో రహదారుల విస్తరణకు రూ .594 కోట్లు



ప్రజాస్ఫూర్తి, ఖమ్మం : ఖమ్మం జిల్లాలో రహదారుల విస్తరణకు రూ. 594 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది . డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క చొరవతో వైరా జగ్గయ్యపేట, మదిర _తూటికుంట్ల, మదిర _ఎర్రుపాలెం, ఖమ్మం _ బోనకల్ మార్గాలు 4 లైన్లగా అభివృద్ధి కానున్నాయి. గ్రామాలు పట్టణాల మధ్య కానెక్టివిటీ మెరుగై రవాణా సౌకర్యాలు పెరగటంతో రైతులు, వ్యాపారులకు ప్రయోజనం కలుగుతుంది.

## ఛలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ




ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: కార్మికులకు ఉరితాళ్లుగా మారే నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని కోరుతూ భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఈనెల 23న హైదరాబాద్‌లోని సెంట్రల్ లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు గౌని నాగేశ్వరరావు, కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి ఎన్.సంజీవ్‌లు తెలిపారు. శుక్రవారం ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ కొత్తగూడెం బంగ్లోస్, బాబు క్యాంపులలో ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మికుల హక్కులను కాల రాస్తున్నారని ఆరోపించారు. ఈనెల 23 న లేబర్ కమిషనర్ ముందు జరిగే ధర్నాను అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శంకర్, రాజేష్, మణెమ్మ, నాగక్క, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## యంగ్ ఇండియన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బాలుకి ఉగాది పురస్కారం



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: ఖమ్మంలో జరిగిన శ్రేయాస్ ఉగాది పురస్కార కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అన్ని రంగాల్లో ఉత్తమ సేవలు అందించే వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో సేవలు అందిస్తున్న కొత్తగూడెంకు చెందిన యంగ్ ఇండియన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బాలుకు ఉగాది పురస్కారం లభించింది. ప్రముఖ గాయని సునీత చేతుల మీదుగా బాలు ఈ అవార్డును అందుకున్నారు. తనకు సహకరిస్తున్న మిత్రులకు ఈ అవార్డును అంకితమిస్తున్నట్లు బాలు తెలిపారు. ఈ మేరకు బాలును పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో నటి మీనాక్షి చౌదరి, టీవీ సీరియల్ నటులు, నిర్వాహకులు, పట్టణ ప్రముఖులు, ఇతర స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, వ్యాపార వేత్తలు పాల్గొన్నారు.

# గంజాయి, ఓపెన్ డ్రింకింగ్‌కు చెక్ పెట్టేందుకు జిల్లా వ్యాప్తంగా నిరంతర దాడులు

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరిష్ ఆదేశాల మేరకు, జిల్లాలో గంజాయి వినియోగం,పబ్లిక్ ప్రదేశాల్లో మద్యం సేవించడం నిరోధించేందుకు ప్రత్యేక దాడులు నిరంతరంగా కొనసాగుతున్నాయి. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న ఒంటరి ప్రాంతాలు, నిర్జన ప్రదేశాలు, అసాంఘిక కార్యకలాపాలకు అనువైన ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు దాడులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ నుండి అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి అనుమానాస్పద ప్రదేశాలను సమగ్రంగా పరిశీలిస్తూ తనిఖీలు నిర్వహిస్తున్నారు.గత 10 రోజుల కాలంలో జిల్లా వ్యాప్తంగా మొత్తం



130 ఒంటరి/నిర్జన ప్రదేశాలు గుర్తించి తనిఖీ నిర్వహించారు. ఓపెన్ డ్రింకింగ్ లో పట్టుపడిన 37 మంది పై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరిష్ మాట్లాడుతూ "గంజాయి వినియోగం పబ్లిక్ ప్రదేశాల్లో మద్యం సేవించడం యువత భవిష్యత్తును దెబ్బతీస్తాయని అన్నారు.గంజాయి అలవాటుకు గురైన వారిని పునరావాసం ద్వారా మార్పు తీసుకురావడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యం అని తెలిపారు . మారాలని భావించే వారు నిర్భయంగా ముందుకు రావాలి, పోలీస్ శాఖ మీకు అండగా ఉంటుందని పిలుపునిచ్చారు. పోలీస్ స్టేషన్‌కు, డయల్ 100 కు సమాచారం అందించాలని కోరారు.మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖ శాంతి భద్రతల పరిరక్షణతో పాటు గంజాయి రహిత సమాజం నిర్మాణం కోసం కట్టుబడి ఉందని,ఇలాంటి తనిఖీలు కొనసాగుతూనే ఉంటాయని ఎస్పీ తెలిపారు.

# అంగన్వాడీల వేతనాల పెంపుపై బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

* **బీజేపీ నాయకులు, చీకోడు ఐదవ వార్డు సభ్యులు బాద నరేష్**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: అంగన్వాడీల వేతనాల పెంపుపై బడ్జెట్ లో నిధులు కేటాయించాలని భారతీయ జనతా పార్టీ నాయకులు, చీకోడు గ్రామ 5వ వార్డు సభ్యులు బాద నరేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీ ప్రకారం అంగన్వాడీ టీచర్లకు 18,000 రూపాయల కనీస వేతనం తక్షణమే అమలు చేయాలన్నారు. ఐసిడిఎస్ విభాగం అభివృద్ధికి, టీచర్ల సంక్షేమానికి ఈ బడ్జెట్ లో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం తన వాగ్దానాన్ని విస్మరిస్తే అంగన్వాడీ టీచర్ల తరపున భారతీయ జనతా పార్టీ పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందని బాద నరేష్ హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడేందుకు తమ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు.

# వేసవికి ముందే అలర్ట్.. తాగునీటి సమస్యలు లేకుండా మిషన్ భగీరథపై సీతక్క ఫోకస్



హైదరాబాద్ : గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ఎలాంటి తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా పైపులైన్ మరమ్మతులు లేదా ఇతర పనులు చేయాల్సి వస్తే, గ్రామస్తులకు ముందుగానే సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను సమర్థవంతంగా నిర్వహించాలని ఆమె స్పష్టం చేశారు. వేసవి కాలంలో తాగునీటి అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో మిషన్ భగీరథ పనితీరుపై మంత్రి సీతక్క సచివాలయంలో విస్తృత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ దివ్య దేవరాజన్, ఇంజినీర్ఇన్‌చీఫ్ కృపాకర్ రెడ్డి, చీఫ్ ఇంజినీర్లు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తాగునీటి సరఫరా పరిస్థితి, నీటి నిల్వల స్థాయి, పంపిణీ వ్యవస్థ పై అధికారులు సమగ్ర వివరాలు మంత్రి ముందు ఉంచారు. అధికారులు సమీక్షలో తెలియజేసిన వివరాల ప్రకారం, రాష్ట్రంలోని ప్రధాన రిజర్వాయర్లు, సోర్స్ పాయింట్ల వద్ద తగిన నీటి నిల్వలు ఉన్నాయని, ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటి కొరత తలెత్తే అవకాశాలు లేవని స్పష్టం చేశారు.

**సమ్మర్ స్పెషల్ డ్రైవ్**

వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని చేపట్టిన "సమ్మర్ స్పెషల్ డ్రైవ్" విజయవంతంగా పూర్తి చేశామని, అందువల్ల గ్రామీణ ప్రాంతాల్లో నీటి సరఫరా అంతరాయం లేకుండా కొనసాగుతోందని తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 90 శాతం మంది సర్పంచులతో మాట్లాడి ఫీడ్‌బ్యాక్ సేకరించామని, వారందరూ తాగునీటి సరఫరాపై సంతృప్తి వ్యక్తం చేశారని అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, మిషన్ భగీరథ వ్యవస్థ ఇంకా అందుబాటులోకి రాని గ్రామాలు, ముఖ్యంగా మారుమూల ఆదివాసీ గూడాల్లో తాగునీటి కోసం బావులు తవ్వాలనే ప్రజల అభ్యర్థనలు వస్తున్నాయన్నారు. అటువంటి ప్రాంతాల్లో ప్రజల అవసరాలను గుర్తించి, తక్షణమే బోర్లు, బావులు తవ్వే ఏర్పాట్లు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా పాండ్స్ ను తవ్వాలని సూచించారు. తద్వారా బుగ్గర బజానాలను పెంచుకోవచ్చని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు.

# మెడికల్ సీట్లపై సుప్రీంకోర్టులో విచారణ ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలకు నోటీసులు



ఖాళీగా ఉన్న మెడికల్ పీజీ సీట్ల భర్తీకి కర్ణాటక, మహారాష్ట్రల్లో ఇచ్చినట్లు సడలింపు ఇవ్వాలని ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని మెడికల్ కాలేజీల యాజమాన్యాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. పిటిషన్‌పై జస్టిస్ పీఎస్ నర్సింహ, జస్టిస్ అలోక్ అరాథే ధర్మాసనం విచారణ చెపట్టింది. ఫిబ్రవరి 28వ తేదీతో కౌన్సెలింగ్ ముగిసిందని అప్పటికి ఏపీలో 246 సీట్లు, తెలంగాణలో 377 పీజీ సీట్లు భర్తీ కాలేదని న్యాయస్థానానికి కాలేజీ యాజమాన్యాలు వివరించాయి. ఏపీలో సుమారు 45 కన్వీనర్ కోటా సీట్లు కూడా ఉన్నాయని తెలిపారు. కాలేజీల్లో చేరేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉన్నారని, గడువు ముగియడంతో కౌన్సెలింగ్ ముగించారని యాజమాన్యాలు ప్రస్తావించాయి. జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ)కి సంబంధిత యూనివర్సిటీలు, కాలేజీలు గడువుకు విజ్ఞప్తి చేశాయని పిటిషన్‌లో పేర్కొన్నాయి. అయితే, యాజమాన్యాలు విజ్ఞప్తి చేసినా ఎలాంటి సమాధానం రాలేదని పిటిషనర్ తరపు అడ్వకేట్లు వాదనలు వినిపించారు. మెడికల్ కాలేజీ యాజమన్యాలు దాఖలు చేసిన పిటిషన్‌పై సమాధానం చెప్పాలని ధర్మాసనం ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ప్రభుత్వాలను ఆదేశించింది. కేసు పూర్తి స్థాయి విచారణ సోమవారం వాయిదా వేసింది.

# 'ఉత్తమ' విద్యకు కేరాఫ్ ఉయ్యాలబాడ ఎంపిపిఎస్

* **కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా విద్యాబోధన**







ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: కార్పొరేట్ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే ఉన్నత స్థాయి విద్యను ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది ఉయ్యాలబాడవ మండల ప్రజా పరిషత్ పాఠశాల. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే కాకుండా పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తూ వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్నారు ఇక్కడి ఉపాధ్యాయులు. భద్రాది కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం, చాతకొండ కాంప్లెక్స్ పరిధిలోని అత్యంత మారుమూల, వెనుకబడిన ఆదివాసి గిరిజన గ్రామంలో ఉంది ఈ ఉయ్యాలబాడవ ఎంపిపిఎస్. ఈ పాఠశాలలో మొత్తం 20 మంది మాత్రమే విద్యార్థులు ఉన్నప్పటికీ ఎలాంటి డ్రాపవుట్స్ లేకుండా ఉపాధ్యాయులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా పూర్వ కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రవేశపెట్టిన ఎఫ్ఎల్‌యన్ బాలమేళా కార్యక్రమంలో భాగంగా ఈ పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు పాయం ఆనందరావు (ఏటిఎఫ్ జిల్లా అధ్యక్షులు), సహ ఉపాధ్యాయులు బానోత్ రాములు నాయక్ (టిఎస్‌టిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి) ఆధ్వర్యంలో పిల్లల సమగ్ర అభివృద్ధి కోసం విశేషంగా శ్రమిస్తున్నారు. పాఠశాలలోనే నవోదయ, గురుకుల, ఏకలవ్య ప్రవేశ పరీక్షలకు శిక్షణ ఇస్తుండగా, 5వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు నవోదయలో సీట్లు సాధించారు. 2024-2025 విద్యా సంవత్సరంలో జిల్లా స్థాయిలో ఉత్తమ పాఠశాల అవార్డును అందుకోగా, ఈ విద్యాసంవత్సరం 2025-2026లో కూడా ఎఫ్ఎల్‌యన్ బాలమేళా పోటీలలో కాంప్లెక్స్, మండల స్థాయిల్లో ఉత్తమ పాఠశాలగా నిలిచి ప్రశంసలు అందుకుంది. 2వ తరగతి నుండి 5వ తరగతి వరకు విద్యార్థులు తెలుగు, ఇంగ్లీష్‌లో నూరుశాతం చదవడం, రాయడం చేయగలుగుతున్నారు. గణితంలో చతుర్విధ ప్రక్రియలు చేయడమే కాకుండా, భారతదేశంలోని రాష్ట్రాలు, రాజధానులు, భాషలు, రాష్ట్రంలోని జిల్లాలు, మండలాలు, గ్రామపంచాయతీల పేర్లు, వేమన నీతి పద్యాలు, తాత్పర్యాలు అనర్గళంగా చెప్తుండటం విశేషం. సాధారణ విజ్ఞానంలో రాష్ట్రపతి నుండి మండల స్థాయి అధికారుల వరకు వారి వివరాలు చెప్పగలుగుతూ అధికారులను ఆశ్చర్యపరుస్తున్నారు. గ్రామస్తులు, తల్లిదండ్రులు, ఎస్ఎంసి కమిటీ సభ్యులు ఉపాధ్యాయులను అభినందిస్తున్నారు. అయితే ఇంత మంచి ప్రతిభ ఉన్నప్పటికీ పాఠశాలకు వంటగది, ప్రహరీ గోడ లేకపోవడంతో పశువుల సంచారం పెరిగి ఇబ్బందులు కలుగుతున్నాయని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్న పాఠశాలకు అవసరమైన వంటగది, ప్రహరీ గోడ మంజూరు చేయాలని గ్రామస్తులు, తల్లిదండ్రులు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

# విద్యా సేవలకు ఉగాది పురస్కారం



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: తెలుగు నూతన సంవత్సరాది పర్వదినమైన ఉగాది సందర్భంగా గురువారం రాత్రి ప్రముఖ ఉపాధ్యాయుడు గోరింట్ల సురేష్ బాబు "శ్రేయాస్ ఉగాది పురస్కారం-2026" అందుకున్నారు.వివిధ విభాగాలకు సంబంధించిన ఉగాది పురస్కారాలను ప్రదానం చేసిన ఆ సంస్థ, సురేష్ బాబు చేస్తున్న విశిష్ట విద్యా సేవలను గుర్తించి ఆయనను విద్యా సేవా పురస్కారానికి ఎంపిక చేసింది. మణుగూరులో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ, అనేక సంవత్సరాలుగా ఆన్లైన్‌లో టెట్ అభ్యర్థులకు ఉచితంగా బోధన అందిస్తున్నందుకు ఆయనకు ఈ గౌరవం లభించింది.ఖమ్మంలోని వందనం రోడ్డులో ఉన్న ఆ సంస్థ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ సినీ గాయని సునీత, వర్ధమాన నటి మీనాక్షి చౌదరి సహా సినీ, సామాజిక రంగాలకు చెందిన ప్రముఖుల చేతుల మీదుగా సురేష్‌బాబు ఈ అవార్డును స్వీకరించారు.అవార్డు అందుకున్న సందర్భంగా గోరింట్ల సురేష్‌బాబును తోటి ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

# జనగణన పకడ్బందీగా జరిగేలా చూడాలి

**: అదనపు కమిషనర్ చంద్రకళ**



హైదరాబాద్ : జనాభా గణన2027 లో ఏ ఒక్కరినీ వదలకుండా, డూప్లికేషన్ లేకుండా చూడాలని జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ చంద్రకళ అన్నారు. క్షేత్రస్థాయిలో జనాభా ఉన్నది ఉన్నట్టు రిఫ్లెక్ట్ కావాలన్నారు. శుక్రవారం జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్ లో జీహెచ్ఎంసీ పరిధిలోనీ సెన్సెస్ 2027 సర్వే పై 60 సర్కిల్ ల పరిధిలో ఛార్జ్ క్లర్క్ లుగా నియామకమైన జూనియర్ అసిస్టెంట్ లు, సీనియర్ అసిస్టెంట్ లు, పర్యవేక్షకుల కు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రకళ మాట్లాడుతూ సెన్సెస్ 2027 సర్వే రెండు దశల్లో జరుగుతుందన్నారు. మొదటి దశలో ఇళ్ల జాబితా సేకరణ, గృహ గణన, రెండో దశలో జనాభా గణన ఉంటుందన్నారు. మొదటి దశ పగడ్బందీగా నిర్వహిస్తే రెండో విడత సజావుగా జరుగుతుందన్నారు. జనాభా గణన 2027 నియమ, నిబంధనల పై పూర్తి అవగాహన పెంపొందించుకొని సెన్సెస్ 2027 పక్కగా జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ చుట్టూ ఐటీ గ్రిడ్

* **పారిశ్రామికాభివృద్ధికి ప్రాధాన్యం**



హైదరాబాద్: రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పరిశ్రమలు, ఐటీ శాఖకు బడ్జెట్‌లో ప్రాధాన్యమిచ్చింది. 202627 బడ్జెట్‌లో పరిశ్రమల శాఖకు రూ.3,490కోట్లను, ఐటీ శాఖకు రూ.875 కోట్లను ప్రభుత్వం ప్రతిపాదించింది. గతేడాది బడ్జెట్‌లో పరిశ్రమల శాఖకు కేటాయించిన (రూ.3,527 కోట్లు) నిధులు స్వల్పంగా తగ్గినా.. ఐటీ శాఖకు మాత్రం గతేడాది (రూ.774కోట్లు) కంటే పెంచారు. ''దేశంలోని మొత్తం గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లలో (జీసీసీల్లో) సుమారు 20 శాతం హైదరాబాద్‌లోనే ఉన్నాయి. 202425లో 70కి పైగా కొత్త జీసీసీలు ఇక్కడ ఏర్పాటు చేశారు. ప్రపంచ టెక్ దిగ్గజం గూగుల్ కంపెనీ హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్‌ను నెలకొల్పింది. హైదరాబాద్ పశ్చిమ ప్రాంతానికే పరిమితం కాకుండా.. నగరం చుట్టూ ఐటీని విస్తరించడానికి గ్రిడ్ (గ్రోత్ ఇన్ డిస్‌పెర్షన్) విధానాన్ని ప్రోత్సహిస్తున్నాం. ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాలకు టి ఫైబర్ ద్వారా సురక్షితమైన హైస్పీడ్ ఇంటర్నెట్ ఇవ్వాలనే ఉద్దేశంతో.. 424 మండలాలలోని 8,888 గ్రామపంచాయతీలకు, 4,800 ప్రభుత్వ సంస్థలకు ఫైబర్ అనుసంధానం చేశాం. ఈ సంవత్సరాంతానికి 50 వేల ప్రభుత్వ సంస్థలకు ఈ సౌకర్యం కల్పించాలన్నది లక్ష్యం'' అని ప్రభుత్వం పేర్కొంది. ఐటీ రంగంలో తెలంగాణ సాధిస్తున్న అభివృద్ధి దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ప్రభుత్వం పేర్కొంది. ''రాష్ట్ర ఐటీ ఎగుమతులు రూ.3.13 లక్షల కోట్లకు చేరుకొని.. 9.39 లక్షల మందికి పైగా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి'' అని వివరించింది. రాష్ట్ర డేటా సెంటర్ ఆధునికీకరణ కోసం రూ.100 కోట్లను బడ్జెట్‌లో పొందుపర్చారు.

* **కొడంగల్‌లో మల్టీ పర్పస్ ఇండస్ట్రియల్ పార్క్**

''తెలంగాణ పశ్చిమ ప్రాంతంలోని కొడంగల్ ముున్ముందు ప్రధాన పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందనుంది. ఈ నేపథ్యంలో రాబోయే రేడియల్ రోడ్ 2 సమీపంలో భారీ పారిశ్రామిక పార్కుల కోసం భూములను సమీకరించనున్నాం. కొడంగల్ మల్టీ పర్పస్ ఇండస్ట్రియల్ పార్క్‌ను కూడా అభివృద్ధి చేయనున్నాం. కేంద్ర ప్రభుత్వ సహకారంతో జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నాం. ఇది 3,245 ఎకరాల విస్తీర్ణంలో జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా అమలవుతోంది' అని ప్రభుత్వం వివరించింది. గ్రామీణ చిన్నతరహా పరిశ్రమలకు రూ.241.96 కోట్లను, హైదరాబాద్‌లో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న యూనిటీ మాల్‌కు రూ.173.16 కోట్లను, పారిశ్రామికాభివృద్ధి ప్రోత్సాహకాలకు రూ.655 కోట్లను, హైదరాబాద్ మినహా ఉమ్మడి 9 జిల్లాల్లో కొత్త పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధికి రూ.146.50 కోట్లను ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రతిపాదించింది.


# టికెట్ తనిఖీలో దక్షిణ మధ్య రైల్వే రికార్డు ఆదాయం



హైదరాబాద్ : టికెట్ లేకుండా ప్రయాణించే వారిపై కట్టడి కఠినతరం కావడంతో దక్షిణ మధ్య రైల్వేకు భారీగా ఆదాయం వచ్చిపడింది. ఎప్పుడూ లేనివిధంగా ఈసారి టికెట్ తనిఖీల ద్వారా రికార్డు స్థాయిలో రూ. 223.60 కోట్లను వసూలు చేస్తూ జోన్ కొత్త మైలురాయిని సృష్టించింది. దక్షిణ మధ్య రైల్వే 202526 ఆర్థిక సంవత్సరంలో ఈ ఆదాయాన్ని నమోదు చేసింది. రైల్వే బోర్డు నిర్దేశించిన రూ. 221.08 కోట్ల లక్ష్యాన్ని ఆర్థిక సంవత్సరం ముగియడానికి 14 రోజుల ముందే అధిగమించడం విశేషం. ఇంతకుముందు 202324లో నమోదైన రూ. 220.81 కోట్ల ఆదాయాన్ని ఈ ఏడాది అధిగమించింది. టికెట్ లేని ప్రయాణం, ముందుగా బుక్ చేయని లగేజీ వంటి కేసులపై జరిపిన తనిఖీల ద్వారా ఈ ఆదాయం సమకూరింది. అలాగే 2025 అక్టోబర్ 18న ఒక్క రోజులోనే రూ. 1.85 కోట్ల ఆదాయం నమోదు కావడం మరో ప్రత్యేకత. టికెట్ తనిఖీ చర్యలతో టికెట్ లేకుండా చేసే ప్రయాణాలను తగ్గించడంలో కీలకంగా పనిచేశాయని అధికారులు తెలిపారు. డిజిటల్ టికెటింగ్ సౌకర్యాలు, ఏటీవీఎంలు, క్యూఆర్ కోడ్ వ్యవస్థలతో కలిసి టికెట్ అమ్మకాలు పెరగడంలో కూడా ఇవి దోహదం చేస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ వాణిజ్య విభాగం సిబ్బందిని అభినందించారు. టికెట్ తనిఖీ వ్యవస్థ ప్రయాణికుల్లో నమ్మకాన్ని పెంచడంలో ముఖ్య పాత్ర పోషిస్తుందని ఆయన తెలిపారు.

# బడ్జెట్‌లో గోదావరి పుష్కరాలకు భారీగా నిధుల కేటాయింపు

హైదరాబాద్ : పన్నెండేళ్లకు ఒకసారి అత్యంత పవిత్రంగా జరుపుకునే గోదావరి పుష్కరాలకు కోసం ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం భారీగా నిధులను కేటాయించింది. రాష్ట్రంలో 2027 జూన్ 26 నుండి జూలై 7 వరకు పుష్కరాలు జరగనున్నాయి. ఈ పవిత్ర దినాల్లో సుమారు 8 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారని ప్రభుత్వం అంచన వేస్తున్నది. ఈ నేపథ్యంలో తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా కుంభమేళా తరహాలో ఈ పుష్కరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. ఈ పుష్కరాల నిర్వహణ, రోడ్ల విస్తరణ, కొత్త ఘాట్ల నిర్మాణం, దేవాలయాల అభివృద్ధి వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధి ఏర్పాట్లను పర్యవేక్షించడానికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నేతృత్వంలో ఇప్పటికే ప్రత్యేక కేబినెట్ సబ్ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం, భద్రత, రద్దీ నియంత్రణ కోసం ఆధునిక సాంకేతికతను వినియోగించే చర్యలు తీసుకుంటున్నది. ఈ గోదావరి పుష్కరాల నిర్వహణ కోసం ఈ బడ్జెట్‌లో రూ.500 కోట్లను ప్రతిపాదించారు.



# విశాఖలో 'ట్రాఫిక్ సోల్జర్స్'.. పోలీసులకు అండగా పౌర సైన్యం

విశాఖపట్నం : నగరంలో ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాల నివారణ లక్ష్యంగా పోలీసులు ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 'ట్రాఫిక్ సోల్జర్స్' పేరుతో పౌర భాగస్వామ్యానికి పెద్దపీట వేస్తూ సరికొత్త విధానాన్ని అమలులోకి తెచ్చారు. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించి, ప్రజలలో రహదారి భద్రతపై అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ఇందులో భాగంగా ఆసక్తి కలిగిన 206 మందిని ఎంపిక చేసి, వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి విధుల్లోకి తీసుకున్నారు. ఈ నెల 16 నుంచి వీరు నగరంలోని 21 ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో సేవలు అందిస్తున్నారు.




**ట్రాఫిక్ సోల్జర్స్ విధులు ఇవే**

ఈ ట్రాఫిక్ సోల్జర్స్ ప్రధానంగా నగరంలోని రద్దీ కూడళ్లు, ఆసుపత్రులు, మార్కెట్ల వద్ద ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి పెడతారు. సిగ్నల్ జంపింగ్, రాంగ్ రూట్‌లో డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, తప్పుడు ప్రదేశాల్లో పార్కింగ్ వంటి నిబంధనల ఉల్లంఘనలను గుర్తిస్తారు. అయితే, జరిమానాలు విధించకుండా, వాహనదారులకు సున్నితంగా నచ్చజెప్పి, నిబంధనలపై అవగాహన కల్పిస్తారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించని వారికి, డ్రైవింగ్‌లో మొబైల్ ఫోన్ వాడేవారికి రహదారి భద్రత ప్రాముఖ్యతను వివరిస్తారు. రద్దీ ప్రాంతాల్లో రోడ్డు దాటడానికి ఇబ్బంది పడుతున్న వృద్ధులు, పిల్లలకు సహాయం చేయడం కూడా వీరి బాధ్యతల్లో ఒకటి. పండుగలు, ర్యాలీలు, వీఐపీల పర్యటనల సమయంలో ట్రాఫిక్ పోలీసులకు చేదోడు వాదోడుగా ఉంటారు.

**స్వయంగా రంగంలోకి దిగిన సీపీ**

ఈ కార్యక్రమం కోసం పోలీసులు నగరంలోని యువతతో మాట్లాడి, ట్రాఫిక్ నియంత్రణలో వారి పాత్ర ఎంత కీలకమో వివరించారు. స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వారి నుంచి 206 మందిని ఎంపిక చేశారు. వీరికి నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ స్వయంగా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా శిక్షణ ఇవ్వడం విశేషం. ప్రమాదాలు జరగకుండా ఎలా పనిచేయాలి, ప్రజలతో ఎలా వ్యవహరించాలనే దానిపై ప్రత్యేక సూచనలు చేశారు. ఈ సోల్జర్స్ ప్రతిరోజూ ఉదయం 8-10 గంటల మధ్య లేదా సాయంత్రం 4-7 గంటల మధ్య రద్దీ సమయాల్లో 3 నుంచి 4 గంటల పాటు సేవలు అందిస్తారు. త్వరలోనే వీరికి ప్రత్యేక గుర్తింపు కార్డులను జారీ చేయనున్నారు. ఆసక్తి ఉన్నవారు ఈ కార్యక్రమంలో చేరవచ్చని పోలీసులు తెలిపారు.

## జగన్ తన మేనల్లుడికి, మేనకోడలికి అన్యాయం చేశాడు: వైఎస్ విజయమ్మ సంచలన ప్రకటన

హైదరాబాద్ : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, ఆయన సోదరి, ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మధ్య గత కొంతకాలంగా కొనసాగుతున్న ఆస్తుల వివాదం మరోసారి తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంపై వారి తల్లి వైఎస్ విజయమ్మ స్వయంగా స్పందించారు. కుటుంబ ఆస్తుల పంపకాలపై పూర్తి స్పష్టతనిస్తూ ఆమె ఓ అడ్వొకేట్ నోటరీ విడుదల చేశారు. ఆ నోటరీ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ లేఖలో ఆమె తన కుమారుడు జగన్ తీరుపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం. "2009లో వైఎస్ రాజశేఖర రెడ్డి గారి మరణం వరకున్న ఆస్తులన్నీ కుటుంబ ఆస్తులే. ఆస్తుల పంపకం ఎప్పుడూ జరగ లేదు. అన్ని ఆస్తులను నలుగురు మనుమలకు సమానంగా పంచాలని వైఎస్సార్ ఉద్దేశం. ఇది ఆయన ఆదేశం కూడా. దగ్గర వాళ్ళందరికీ తెలిసిన వాస్తవమిది. ఎంవోయూలో షర్మిలకు రాసిన ప్రతి ఆస్తి న్యాయంగా ఆమెకు చెందాల్సినవే. అందుకే జగన్ ఎంవోయూ రాశాడు (నిజానికి తనకు తక్కువే రాశాడు. సరస్వతి సిమెంట్ తో సహా ఎంవోయూలో లేని యెలహంక ల్యాండ్ కూడా షర్మిలదే. ఇచ్చాను అని చెప్తున్న డబ్బు షర్మిల వాటాకు ఇచ్చిన



డివిడెండ్ మాత్రమే). ఆస్తులు విషయంలో జగన్ తన మేనల్లుడికి, మేనకోడలికి ఇప్పటివరకు అన్యాయం చేశాడు. ఎప్పటికైనా న్యాయం చేస్తాడని తన తల్లిగా ఆశిస్తున్నాను. ఆస్తుల పంపకం జరగలేదు. షర్మిలకు ఇచ్చినటువంటి ఆస్తుల లాంటివే వైఎస్సార్ గారు జగన్ కు కూడా ఇచ్చారు. అది ఆస్తి పంపకం కాదు. నిజం ఏమిటో నా దేవుడికి, నా కొడుకుకి కూడా తెలుసు. గోబెల్స్ ప్రచారం చేయడానికి మీరు ఎవరు? మీరు ఎంత కాదన్నా దేవుడి న్యాయమే న్యాయం. అసత్యాల ప్రచారం మానుకోవాలని వైఎస్సార్ భార్యగా చేతులు జోడించి అడుగుతున్నాను. మళ్లీ మళ్లీ మీడియాలో ప్రస్తావించొద్దని వేడుకుంటున్నా. దేవుని సాక్షిగా నేను రాసినవన్నీ వాస్తవాలు మాత్రమే" అంటూ విజయమ్మ తన నోటరీలో పేర్కొన్నారు.

## భ్రష్టు పట్టించడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం హ్యాట్రిక్ కొట్టింది : బడ్జెట్ పై బండి సంజయ్

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం హ్యాట్రిక్ కొట్టిందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూడో బడ్జెట్ ప్రవేశపెట్టడాన్ని ఉద్దేశించి ఆయన అన్నారు. తెలంగాణ బడ్జెట్ పై ఆయన స్పందించారు. అంకెల ఆర్భాటాలు, కేటాయింపుల ప్రగల్భాలు తప్ప ఏమీలేదని అన్నారు. ఆదాయాన్ని రాకుండా చేసి, అప్పులకోసం అర్రులు చాచే బడ్జెట్‌గా కనిపిస్తోందని విమర్శించారు. రైతు భరోసా డబ్బులు రెండు విడతలుగా ఎగ్గొట్టినట్లే అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఇప్పటికీ అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యకు 16 శాతం నిధులు కేటాయించాలని విద్యా శాఖ కమిషన్ ప్రతిపాదిస్తే కేవలం 8 శాతమే కేటాయించారని అన్నారు. ఆరోగ్యశ్రీ బడ్జెట్‌కు కేటాయింపుల కంటే గత బకాయిలే ఎక్కువగా ఉన్నాయని చురక అంటించారు. దేవాదాయ శాఖకు గత బడ్జెట్‌లో రూ.190 కోట్లు కేటాయిస్తే, ఈసారి ఆ ప్రస్తావన లేదని అన్నారు. పన్నెండేళ్లకు ఒకసారి వచ్చే పుష్కరాలకు కేటాయింపులు తూతూమంత్రంగా ఉన్నాయని ఆయన విమర్శించారు. 56 శాతం బీసీ జనాభాకు నాలుగు శాతం కేటాయింపులు విడ్డూరమని బండి సంజయ్ అన్నారు. రెండేళ్లలో దిగిపోయే ప్రభుత్వమే కదా అని, ఇష్టారాజ్యంగా అప్పులు చేసేందుకు సిద్ధపడ్డట్లుగా ఈ బడ్జెట్ కనిపిస్తోందని మండిపడ్డారు. బీజేపీ



అధికారంలోకి వస్తే గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ అప్పుల బాగోతాన్ని బయటకు తీసుకువచ్చి విచారణ చేపడతామని అన్నారు.

## సనత్ నగర్‌లో చలివేంద్రాలు, అన్నదానాన్ని ప్రారంభించిన తలసాని!

హైదరాబాద్ : ఆకలితో అలమటిస్తున్న నిరుపేదలకు అండగా నిలవడాన్ని మించిన గొప్ప కార్యం మరొకటి లేదని సనత్ నగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సనత్ నగర్ పరిధిలోని బీకే గూడ పార్క్ వద్ద 'శ్రీనివాస సమాజసేవ చారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మధ్యాహ్న భోజన పంపిణీ కేంద్రం, చలివేంద్రాలను ఈరోజు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సేవ చేయాలనే సంకల్పం ఉన్న సీనియర్ సిటిజన్‌లను ఆయన మనస్ఫూర్తిగా అభినందించారు. 2011 నుంచి ప్రతి ఏటా వేసవి



కాలంలో సుమారు 70 రోజుల పాటు నిరంతరాయంగా పేదలకు రుచికరమైన భోజనాన్ని అందిస్తుండటంపై తలసాని హర్షం వ్యక్తం చేశారు. "ఉద్యోగ విరమణ చేసిన తర్వాత విశ్రాంతి తీసుకోకుండా, సమాజానికి ఏదో ఒకటి చేయాలనే తపనతో ఈ వయసులోనూ సేవ చేస్తున్న సీనియర్ సిటిజన్‌లు అందరికీ ఆదర్శం" అని ఆయన కొనియాడారు. సనత్ నగర్ నియోజకవర్గంలోని సీనియర్ సిటిజన్లు చూపుతున్న ఈ చొరవ రాష్ట్రానికే గర్వకారణమని పేర్కొన్నారు. తనను కలవడానికి వచ్చినప్పుడు శాలువాల కోసం డబ్బు వృథా చేయవద్దని... ఆ డబ్బును కూడా సేవా కార్యక్రమాలకే వినియోగించండని తలసాని చెప్పారు. నిస్వార్థంగా సేవ చేస్తున్న మీరందరూ తన గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని, వయసులో పెద్దవారైన మీ ఆశీస్సులు ఎప్పుడూ తనపై ఉండాలని ఆయన కోరారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున వయసు రీత్యా అందరూ జాగ్రత్తగా ఉండాలని, ఆరోగ్యం విషయంలో అజాగ్రత్త వహించవద్దని సూచించారు.


## తెలంగాణ బడ్జెట్‌ను స్వాగతించిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



హైదరాబాద్ : తెలంగాణ బడ్జెట్ పై ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ స్పందించారు. ఈ బడ్జెట్ రైతులు, సంక్షేమం, సమగ్ర అభివృద్ధిపై దృష్టి సారించిందని అన్నారు. మైనారిటీల సంక్షేమానికి రూ.3,769 కోట్లు కేటాయించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇది సమ్మిళిత వృద్ధిపట్ల ప్రభుత్వం నిబద్ధతను ప్రతిబింబిస్తుందని ఆయన అన్నారు. మైనారిటీల కోసం గత సంవత్సరం బడ్జెట్‌లో కంటే ఈసారి రూ.178 కోట్లు అధికంగా కేటాయించారని ప్రశంసించారు. మైనారిటీ మహిళలకు 10,000 కుట్టు మిషన్ల పంపిణీ, 4,655 మంది మైనారిటీ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ వంటి కార్యక్రమాలు ఆర్థిక స్వావలంభనకు తోడ్పడుతాయని పేర్కొన్నారు. మైనారిటీ వర్గాల ఉపాధి అవకాశాలను ఇవి మెరుగుపరుస్తాయని ఆయన తెలిపారు. ఈ బడ్జెట్‌లో మైనారిటీల విద్య, వ్యాపారాల అభివృద్ధి, ఆర్థిక స్వావలంభనకు ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు.

## హైదరాబాద్‌లోని ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏపై కేంద్ర ప్రభుత్వం తీపికబురు

హైదరాబాద్ : తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో ఉద్యోగం చేసేవారికి కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇంటి అద్దె భత్యం (హెచ్ఆర్ఏ) మినహాయింపును 50 శాతానికి పెంచింది. ఇప్పటి వరకు ముంబై, కోల్‌కతా, ఢిల్లీ, చెన్నై నగరాలను మాత్రమే మెట్రో నగరాలుగా పరిగణించేవారు. దీనితో ఆయా నగరాల్లో హెచ్ఆర్ఏ మినహాయింపు పరిమితి 50 శాతంగా ఉంటోంది. తాజాగా ఈ జాబితాలో హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, పుణే, అహ్మదాబాద్ చేరాయి. ఆదాయపు పన్ను నిబంధనలు, 2026ను కేంద్రం నోటిఫై చేసింది. ఆరు దశాబ్దాల పాత ఆదాయపు పన్ను చట్టం




1961 స్థానంలో కొత్త ఆదాయపు పన్ను చట్టాన్ని ప్రభుత్వం అమల్లోకి తెస్తోంది. ఇందులో భాగంగా ఏప్రిల్ 1 నుంచి రాబోయే కొత్త నిబంధనలను నోటిఫై చేస్తూ గెజిట్ జారీ చేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరంతో 8 నగరాల్లోని ఉద్యోగులకు తమ వేతనంలో 50 శాతం వరకు హెచ్ఆర్ఏ కింద పన్ను మినహాయింపును పొందవచ్చు. 2027 జులైలో ఫైల్ చేయబోయే రిటర్నుల సమయంలో ఇది వర్తిస్తుంది. హెచ్ఆర్ఏ మినహాయింపు పొందాలంటే ఇకపై పన్ను చెల్లింపుదారులు తాము నివసిస్తున్న ఇంటి యజమానితో తమకు ఉన్న సంబంధాన్ని తప్పనిసరిగా వెల్లడించవలసి ఉంటుంది. ఫారమ్ 124లో ఈ వివరాలు నమోదు చేయాలి. పార్లమెంటు ఆగస్ట్ 12న కొత్త ఆదాయపు పన్ను బిల్లుకు ఆమోదం తెలిపింది.





## శంషాబాద్ విమానాశ్రయానికి అంతర్జాతీయ పురస్కారం

హైదరాబాద్ : శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ) మరోసారి అంతర్జాతీయ స్థాయిలో తన ప్రత్యేకతను చాటుకుంది. ప్రఖ్యాత స్కైట్రాక్స్ సంస్థ నుంచి 'బెస్ట్ ఎయిర్‌పోర్ట్ స్టాఫ్ ఇన్ ఇండియా & సౌత్ ఏషియా 2026' (భారత్, దక్షిణాసియాలో ఉత్తమ విమానాశ్రయ సిబ్బంది) అవార్డును గెలుచుకుంది. ఈ విమానాశ్రయానికి ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించడం ఇది ఐదోసారి కావడం విశేషం. లండన్‌లో జరిగిన ప్యాసింజర్ టెర్మినల్ ఎక్స్‌పో 2026 కార్యక్రమంలో ఈ అవార్డును అధికారికంగా ప్రకటించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రయాణికుల నుంచి సేకరించిన అభిప్రాయాల ఆధారంగా విమానాశ్రయ సిబ్బంది స్నేహపూర్వక వైఖరి, సేవల నాణ్యతను అంచనా వేసి స్కైట్రాక్స్ ఈ పురస్కారాలను అందిస్తుంది. చెక్‌ఇన్, సెక్యూరిటీ, ఇమ్మిగ్రేషన్, బోర్డింగ్ వంటి అన్ని విభాగాల్లో సిబ్బంది పనితీరును దీనికోసం పరిగణనలోకి తీసుకుంటారు. ఈ అవార్డుతో పాటు శంషాబాద్ విమానాశ్రయం మరికొన్ని ఘనతలను కూడా సాధించింది. భారత్, దక్షిణాసియాలో 'రెండో ఉత్తమ ప్రాంతీయ విమానాశ్రయం'గా, 'మూడో ఉత్తమ విమానాశ్రయం'గా నిలిచింది.

## ఇది కుంభకోణాల పద్దు.. మహిళలు, రైతులను కాంగ్రెస్ నిలువునా ముంచింది

హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్‌పై ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ముప్పేట దాడికి దిగింది. మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, ఈ బడ్జెట్ ప్రజలందరినీ వంచించేలా ఉందని, అందరి చెవిలో పూలు పెట్టే ప్రయత్నాన్ని రేవంత్ సర్కార్ చేస్తోందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అటకెక్కించిందని జగదీశ్ రెడ్డి విమర్శించారు. మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ. 2,500 ఇస్తామని రేవంత్ రెడ్డి స్వయంగా హామీ ఇచ్చారని... ప్రభుత్వం వచ్చి రెండున్నరేళ్లు కావస్తున్నా ఆ ఊసే ఎత్తడం లేదని దుయ్యబట్టారు. ఇది ఆడబిడ్డలను నట్టేట ముంచడం కాదా? అని ప్రశ్నించారు. రైతు భరోసాపై నమ్మక ద్రోహం చేశారని ఆయన మండిపడ్డారు. ఎకరానికి రూ. 15 వేలు ఇస్తామని చెప్పి మాట తప్పారని విమర్శించారు. కనీసం పాత పద్ధతిలో ఇవ్వాల్సిన రూ. 12 వేలు అయినా ఎప్పుడు ఇస్తారో కూడా బడ్జెట్‌లో స్పష్టత లేదని ధ్వజమెత్తారు. రైతులకు ఇచ్చిన ప్రతి మాట ఉత్తమాటగానే మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధులు, వికలాంగుల ఆశలపై కూడా ప్రభుత్వం నీళ్లు చల్లిందని జగదీశ్ రెడ్డి విమర్శించారు. "వృద్ధులకు రూ. 4 వేలు, వికలాంగులకు రూ. 6 వేలు పెన్షన్ ఇస్తామని చెప్పి ఇప్పుడు మౌనంగా ఉండటం దారుణం. నిరుద్యోగులు, ప్రభుత్వ




ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈ బడ్జెట్‌లో చిన్న కేటాయింపు కూడా లేదు" అని ఆయన మండిపడ్డారు. ఈ బడ్జెట్ ప్రజల అభివృద్ధి కోసం కాదని, కేవలం కాంగ్రెస్ నేతలు కుంభకోణాలు చేసుకోవడానికే పనికొస్తుందని జగదీశ్ రెడ్డి సంచలన ఆరోపణ చేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా పక్కదారి పట్టించేందుకే అంకెల గారడీ చేస్తున్నారని విమర్శించారు.

# రొటీన్ వర్కౌట్ చేస్తే.. రహస్యంగా ఉన్న నౌక లొకేషన్ తెలిసిపోయింది..!

ఫ్రాన్స్ : ఒక సైనికాధికారి రోజులాగే వ్యాయామాలు చేసుకున్నారు. తర్వాత తన పనులు ముగించుకొని విధులు నిర్వర్తిస్తున్నారు. కానీ, ఆయన తనకు తెలియకుండానే సైన్యానికి చెందిన విమాన వాహన నౌక లొకేషన్‌ను బయటపెట్టాడు (French aircraft carrier location). ఇంతకీ ఏం జరిగిందంటే..? ఫ్రాన్స్ మీడియా కథనాల ప్రకారం.. ఫ్రెంచ్ నౌకదళానికి చెందిన చార్లెస్ డి గాల్ విమాన వాహన నౌకలో ఒక యువ నావికాదళ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు. తన రొటీన్‌లో భాగంగా ఫిట్‌నెస్ యాప్ స్ట్రావాలో ఒక అరగంటపాటు వ్యాయామం చేశాడు. పైకి ఇదంతా సాధారణంగానే ఉంది. కానీ, తనకు తెలియకుండా మధ్యధరా సముద్రంలో ఉన్న నౌక కచ్చితమైన లొకేషన్‌ను బయటపెట్టాడు. అది సైప్రస్ దేశానికి వాయవ్యదిశలో తుర్కియే 100 కి.మీ.దూరంలో ఉందనే డేటా మొత్తం



వెలుగులోకి వచ్చింది. . ఈ స్ట్రావా ఫిట్‌నెస్ యాప్‌ను ప్రపంచవ్యాప్తంగా 120 మిలియన్ల మంది వాడుతున్నారు. దీని యూజర్లు తమ ఫిట్‌నెస్ రొటీన్‌ను షేర్ చేసుకునే వీలు ఉంటుంది. ఈ ఫీచర్ కారణంగా దానిని వాడుతున్న వ్యక్తుల స్థానం గురించే కాకుండా.. క్యారియర్ లొకేషన్ కూడా తెలిసిపోయిందని ఆ మీడియా సంస్థ వెల్లడించింది. ఆ అధికారి వర్కౌట్ తర్వాత తీసిన శాటిలైట్ చిత్రాల ఆధారంగా ఈ సమాచారాన్ని ధ్రువీకరించుకున్నట్లు పేర్కొంది. ఈ లోపాన్ని ఫ్రాన్స్ సైనిక ఉన్నతాధికారులు అంగీకరించారు. అయితే మీడియా సంస్థ అలా నౌక లొకేషన్‌ను బయటపెట్టడాన్ని తప్పుపట్టారు. ఈ ప్రవర్తన డిజిటల్ సెక్యూరిటీ రూల్స్‌ను ఉల్లంఘించేదిగా ఉందని ఆగ్రహం వ్యక్తంచేశారు. నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో మార్చి 3న ఆ నౌకను మోహరించామని ఫ్రాన్స్ వెల్లడించింది. మోహరింపు గురించి తెలిసినప్పటికీ.. ఈ యాప్ ద్వారా కచ్చితమైన లొకేషన్ వెలుగులోకి రావడం ఆందోళనకు దారితీసింది.

## దిల్లీ టు దిల్లీ: 8 గంటల పాటు
# గాల్లోనే ఎయిరిండియా విమానం!

దిల్లీ: దేశ రాజధాని దిల్లీ నుంచి కెనడాలోని వాంకోవర్‌కు ఎయిరిండియా విమానంలో బయల్దేరిన ప్రయాణికులకు ఊహించని అనుభవం ఎదురైంది. దాదాపు 8 గంటల పాటు ప్రయాణించిన ఆ విమానం తిరిగి దిల్లీలోనే ల్యాండ్ అయ్యింది. సదరు విమానానికి కెనడాలో ప్రయాణానికి అనుమతి లేకపోవడమే ఇందుక్కారణం. దీంతో మార్గమధ్యం నుంచి వెనక్కి రప్పించాల్సి వచ్చింది. ఎయిరిండియాకు చెందిన AI185 విమానం గురువారం ఉదయం 11.34 గంటల సమయంలో ప్రయాణికులతో టేకాఫ్ అయ్యింది. చైనా గగనతలంలోకి ప్రవేశించాక అసలు విషయం తెలిసింది. ఏవియేషన్ అధికారులు




వెనక్కి రావాల్సిందిగా పైలట్లను ఆదేశించారు. దీంతో విమానం దిల్లీకి తిరుగు ప్రయాణం అయ్యింది. సుమారు 7 గంటల 54 నిమిషాల తర్వాత టేకాఫ్ అయిన చోటే మళ్లీ ల్యాండ్ అయ్యింది. ఎయిరిండియాకు చెందిన బోయింగ్ 777 300ER శ్రేణి విమానాలకు మాత్రమే కెనడాలో అనుమతి ఉంది. కానీ, ఎయిరిండియా పొరపాటున అనుమతి లేని బోయింగ్ 777-200LRని పంపింది. ప్రయాణికులందరికీ హోటల్‌లో వసతి సౌకర్యం కల్పించారు. శుక్రవారం ఉదయం వేరే విమానంలో వాంకోవర్ పంపించారు. సాధారణంగా బోయింగ్ 777 విమానం గంటకు 8 నుంచి 9 టన్నుల ఇంధనాన్ని వినియోగిస్తుంది. ఆ లెక్కన 8 గంటల ప్రయాణంతో పాటు, ప్రయాణికుల హోటల్ బిల్లు కారణంగా ఎయిరిండియాకు ఆ మేర భారీగా నష్టం వాటిల్లింది.

# ‘తృణమూల్’ మ్యానిఫెస్టో విడుదల.. దీదీ 10 హామీలు ఇవే..

పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల కోలాహలం కొనసాగుతోంది. అధికార, ప్రతిపక్ష పార్టీల నేతల విమర్శలు, ప్రతి విమర్శలతో అక్కడి రాజకీయాలు మరింత హీటు పుట్టిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, సీఎం మమతా బెనర్జీ శుక్రవారం ఎన్నికల మ్యానిఫెస్టో విడుదల చేశారు. బెంగాల్ ఓటర్లను ఆకర్షించి మరోసారి అధికార పీఠాన్ని దక్కించుకోవడమే లక్ష్యంగా సీఎం మమతా బెనర్జీ 10 కీలక హామీలు ప్రకటించారు. మరోసారి తమ పార్టీని గెలిపిస్తే రాబోయే ఐదేళ్లలో ప్రతి ఇంట్లో ఆనందం నింపాలనే ఆశయంతో పనిచేస్తామన్నారు.

*** మహిళలు, నిరుద్యోగులకు ఆర్థిక సాయం.. 7 కొత్త జిల్లాల ఏర్పాటు**

‘ఈసారి తిరిగి అధికారంలోకి వస్తే.. ప్రతి నెలా మహిళలకు ఇస్తున్న ఆర్థిక సాయం రూ.500 పెంచుతాం. అంటే జనరల్ కేటగిరీ మహిళలకు రూ.1500, ఎస్సీ/ఎస్టీ మహిళలకు రూ.1700 చొప్పున అందజేస్తాం. నిరుద్యోగులకు ప్రతి నెలా రూ.1500 సాయం అందిస్తాం. ఇంటి వద్దే నాణ్యమైన వైద్య సేవలు అందించేలా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తాం. రాష్ట్రంలోని వేలాది పాఠశాలలను ఆధునికీకరిచడంతో పాటు ఈలెర్నింగ్ సదుపాయాలు కల్పిస్తాం. కొత్తగా ఏడు జిల్లాలు, మున్సిపాల్టీలను ఏర్పాటు చేసి పాలనను ప్రజలకు మరింత చేరువ చేస్తాం. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రూ.30వేల కోట్లతో ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశ పెడతాం. ప్రతి కుటుంబానికీ శాశ్వత ఇంటి నిర్మాణం చేపట్టడంతో పాటు ప్రతి ఇంటికీ శుద్ధి చేసిన తాగునీటి సరఫరా అందేలా చూస్తాం. ప్రపంచ స్థాయి లాజిస్టిక్స్, ఓడరేవు సౌకర్యాలు, వాణిజ్య మౌలిక సదుపాయాలు, అత్యాధునిక గ్లోబల్ ట్రేడ్ సెంటర్‌ను అభివృద్ధి చేయడం ద్వారా బెంగాల్‌ను పెట్టుబడులు, వ్యాపారాలకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దుతాం. వయోవృద్ధులందరికీ నిరంతరాయంగా వృద్ధాప్య పింఛను




అందించడంతో పాటు అర్హులైన వారిని ఈ పథకం కిందకు తీసుకొచ్చి క్రమంగా విస్తరిస్తాం’’ అని మమతా బెనర్జీ హామీ ఇచ్చారు.

**అన్ని మతాలూ నాకు సమానమే: దీదీ**

పశ్చిమ బెంగాల్ ఎన్నికల అనంతరం ఎన్‌ఆర్‌సీ, జనగణన పేరుతో ప్రజల పౌరసత్వాన్ని తొలగించేందుకు కేంద్రం ప్రణాళికలు రచిస్తోందని మమతా బెనర్జీ అన్నారు. మ్యానిఫెస్టో విడుదల చేసిన అనంతరం ఆమె మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో భాజపా గెలుపునకు సహకరించేలా కేంద్రం, ఈసీ నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణకు ప్లాన్ చేస్తున్నాయన్నారు. ఈ ఎన్నికల్లో ఓడిపోతామని భాజపాకు తెలుసు గనకే రాష్ట్రంలో ‘అనధికార రాష్ట్రపతి పాలన’ విధించారని ఆరోపించారు. రాష్ట్రాన్ని కాపాడేందుకు భాజపాకు వ్యతిరేకంగా ఐక్య పోరాటం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. భయపెట్టినా, డబ్బులు ఇచ్చి ప్రలోభ పెట్టినా అప్రమత్తంగా ఉండాలన్నారు. తాను విభజన రాజకీయాలు చేయడంలేదని, అన్ని మతాల ప్రజలూ తనకు సమానమేనని తెలిపారు. బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ జరగనున్నాయి. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి.

# మిద్దెపై ముత్యాల సాగు.. భారీ ఆదాయం

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని నోల్‌ఖా గ్రామానికి చెందిన దిలీప్ జగ్‌దేవ్ అనే రైతు.. సంప్రదాయ వ్యవసాయానికి భిన్నమైన పద్ధతిని ఎంచుకొని విజయం సాధించారు. రూ.18 వేల పెట్టుబడితో ముత్యాల సాగు చేపట్టారు. ఇందుకోసం తొలుత తన ఇంటి పైకప్పునే ఎంచుకొని.. 500 చిప్పలతోనే సాగు మొదలుపెట్టారు. ప్రారంభంలో అనేక ఆటంకాలు ఎదురైనప్పటికీ.. వివిధ ప్రాంతాలకు వెళ్లి సాగు విధానంలో మెళకువలను నేర్చుకున్నారు. తొలి మూడు, నాలుగేళ్లలో ఎలాంటి లాభాలు రాలేదు. ఆ తర్వాత మెల్లగా లాభాల పంట మొదలైంది. రెండు యూనిట్లలో 25వేల చిప్పలతో వేలాది



ముత్యాలను తీస్తున్నారు. వినూత్న ఆలోచనతో ఒక్క చిప్పలోనే గరిష్ఠంగా 40 ముత్యాలను సేకరించగలుగుతున్నారు. తనతోపాటు వేలాది మందికి దిలీప్ శిక్షణ ఇవ్వడం గమనార్హం.


# అహ్మదాబాద్ ఎయిరిండియా ప్రమాదం... విమానంలో 11 ఏళ్లుగా సమస్యలు

అహ్మదాబాద్ : గత ఏడాది జూన్ 12న ఎయిరిండియా విమానం అహ్మదాబాద్ నుంచి బయలుదేరిన కొద్దిసేపటికే ప్రమాదానికి (Air India Plane Crash) గురైన విషయం తెలిసిందే. ఈ ఘటనలో విమానంలోని ప్రయాణికులు సహా మొత్తం 260 మంది ప్రాణాలు కోల్పోయారు. దీనిపై విమాన ప్రమాద దర్యాప్తు విభాగం (AAIB) దర్యాప్తు చేస్తోంది. కాగా ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్న ఏఏఐబీ, జాతీయ రవాణా భద్రతా బోర్డు (NTSB)లపై అమెరికాకు చెందిన ఫౌండేషన్ ఆఫ్ ఏవియేషన్ సేఫ్టీ (FAS) తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ విమానంలో గత 11 ఏళ్లుగా పలు సాంకేతిక సమస్యలు ఉన్నట్లు వెల్లడించింది. విమానంలో తీవ్రమైన ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ సమస్యలు, పవర్ కంట్రోల్ యూనిట్, ఫ్లైట్ మేనేజ్‌మెంట్ కంప్యూటర్‌లో వైఫల్యాలను గుర్తించినట్లు పేర్కొంది. విమానంలో లోపాలకు సంబంధించి బహిర్గతం కాని పలు



పత్రాలను తాము సేకరించామని.. వాటిని క్షుణ్ణంగా పరిశీలించాకే ఈ విషయాన్ని వెల్లడించామని ఎఫ్ఏఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎడ్ పియర్సన్ పేర్కొన్నారు. ఆయా పత్రాలను భారత్‌లోని జాతీయ రవాణా భద్రతా బోర్డు (NTSB), విమాన ప్రమాద దర్యాప్తు బ్యూరో (AAIB)కు పంపినప్పటికీ వాటి నుంచి తమకు ఎలాంటి స్పందన రాలేదన్నారు. తాము సేకరించిన వివరాలను ఏఏఐబీ పరిగణలోకి తీసుకుందా, లేదా అనే విషయం తెలుసుకోవడానికి వారికి లేఖ రాసినా ఎటువంటి జవాబు లేదని తెలిపారు. ప్రమాదంపై మరోసారి క్షుణ్ణంగా దర్యాప్తు జరపాల్సిన అవసరం ఉందన్నారు. ఎఫ్ఏఎస్ చేసిన ఆరోపణలపై విమాన ప్రమాద దర్యాప్తు విభాగం స్పందించాల్సి ఉంది.







# ఐఐటీ దిల్లీకి..
## పూర్వ విద్యార్థి యార్డీ విరాళం రూ.75 కోట్లు

దిల్లీ: కృత్రిమమేధ రంగంలో చేపడుతున్న అత్యాధునిక పరిశోధనలను మరింత ముందుకు నడిపించేలా తమ పూర్వ విద్యార్థి, యార్డీ సిస్టమ్స్ వ్యవస్థాపకుడు అనంత్ యార్డీ రూ.75 కోట్లు విరాళంగా ఇచ్చారని ఐఐటీ దిల్లీ గురువారం ప్రకటించింది. 1968 బ్యాచ్‌కు చెందిన అనంత్ యార్డీ (79) విద్యపరంగా తనకు బలమైన పునాదిని అందించిన సంస్థకు కృతజ్ఞతలు తెలియజేశారు. మరోవైపు.. మెటీరియల్స్ ఇంజినీరింగ్ అనే సంక్లిష్ట విషయాన్ని ఆసక్తికరంగా, సులువుగా చెప్పేందుకు ఐఐటీ దిల్లీ తొలిసారిగా కామిక్ పుస్తకాన్ని రూపొందించింది. భవిష్యత్తులో మరిన్ని కామిక్ పుస్తకాలను విడుదల చేస్తామని అధికారులు వెల్లడించారు.

# అమెరికా ఎఫ్35ని ఢీకొట్టామిలా.. వీడియో రిలీజ్ చేసిన ఇరాన్

అమెరికా : ఇరాన్‌తో యుద్ధంలో అమెరికా కీలక యుద్ధ విమానాలను కోల్పోతోంది. తాజాగా ఎఫ్ 35 యుద్ధ విమానాన్ని (F35 Fighter Jet) ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థ అడ్డుకోవడంతో.. పశ్చిమాసియాలోని అమెరికా స్థావరంలో అత్యవసరంగా దిగాల్సి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై ఇరాన్ ప్రకటన విడుదల చేసింది. ‘‘మా గగనతల రక్షణ వ్యవస్థ అర్ధరాత్రి దాటిన తర్వాత యూఎస్ సైన్యానికి చెందిన ఎఫ్35



యుద్ధ విమానాన్ని దెబ్బతీసింది. అది ఏ స్థాయిలో దెబ్బతిన్నదనే దానిపై దర్యాప్తు చేస్తున్నాం. అది పూర్తిగా ధ్వంసం కావడానికే ఎక్కువ అవకాశాలు ఉన్నాయి’’ అని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ (IRGC) వెల్లడించింది. అలాగే గాలిలో విమానాన్ని ఒక క్షిపణి ఢీకొడుతున్నట్టుగా ఉన్న వీడియోను రిలీజ్ చేసింది. మరోవైపు ఇదే ఘటనపై యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రతినిధి కెప్టెన్ టిమ్ హాకిన్స్ స్పందించారు. ఇరాన్ యుద్ధంలో (Iran) భాగమైన ఫైటర్ జెట్ ఒకటి అత్యవసరంగా ల్యాండ్ అయిందని చెప్పారు. అది సురక్షితంగా దిగిందని, ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోందని చెప్పారు. ఎఫ్35ని క్షిపణుల వంటివి తాకి ఇలా ఎమర్జెన్సీ ల్యాండ్ అవడం ఇదే తొలిసారి. ఈ ఫైటర్ జెట్ విలువ వందల కోట్లలోనే ఉంటుంది. దీని కనీస విలువ రూ.82.5 మిలియన్ డాలర్లు (రూ.769 కోట్లకు పైగానే) గా ఉంది.

## నాటో దేశాలపై ట్రంప్ చిందులు.. పిరికివాళ్లంటూ ఎద్దేవా!

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నాటో సభ్యదేశాల వ్యవహారశైలిపై అసహనం వ్యక్తంచేశారు. హర్మూజ్ జలసంధిని తెరిపించేందుకు కలిసి రావాలన్న ఆయన విజ్ఞప్తిని పట్టించుకోకపోవడంపై ఆయన చిర్రుబుర్రలాడారు. పిరికివాళ్లంటూ ఎద్దేవా చేశారు. ఈ సందర్భాన్ని గుర్తు పెట్టుకుంటానని హెచ్చరిస్తూ ట్రూత్ సోషల్‌లో ఆయన శుక్రవారం ఓ పోస్ట్ పెట్టారు. ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా జరిపిన దాడి నేపథ్యంలో చమురు రవాణాకు జీవనాడి లాంటి హర్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ అవాంతరాలు సృష్టిస్తోంది.



దీంతో అంతర్జాతీయంగా చమురు ధరలు భగ్గుమన్నాయి. కొన్ని దేశాలు చమురు, గ్యాస్ కొరతను ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో హర్మూజ్‌ను తిరిగి తెరిపించేందుకు కలిసి రావాలని డొనాల్డ్ ట్రంప్.. నాటో దేశాలకు విజ్ఞప్తి చేశారు. దీనిపై ఏ దేశమూ ముందుకు రాకపోవడం ట్రంప్‌నకు కోపం తెప్పించింది.

# ఒత్తిళ్లకు తలొగ్గం.. అమెరికా విజ్ఞప్తికి శ్రీలంక ‘నో’!

కొలంబో: పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో అగ్రరాజ్యం అమెరికా చేసిన ఓ విజ్ఞప్తిని శ్రీలంక తిరస్కరించింది. మార్చి నెల ఆరంభంలో రెండు యుద్ధ విమానాలను మట్టాలా అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండింగ్ కోసం అమెరికా అనుమతి కోరగా.. అందుకు నిరాకరించింది. ఈ విషయాన్ని శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే (Anura Kumara Dissanayake) పార్లమెంటులో వెల్లడించారు. ఎర్ర సముద్రం, ఏడెన్ గల్ఫ్ మధ్య ఓ కీలక సముద్ర మార్గంగా ఉన్న జిబౌటీ స్థావరంలోని అమెరికా యుద్ధ విమానాల నుంచి రెండుసార్లు అభ్యర్థనలు వచ్చాయన్నారు. ఈ స్థావరం నుంచి మార్చి 4, 8 తేదీల్లో పలు నౌకా విధ్వంసక మిసైల్స్‌తో కూడిన యుద్ధ విమానాల ల్యాండింగ్ కోసం అడిగితే.. తాము వద్దని చెప్పామన్నారు. అమెరికా ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య కొనసాగుతోన్న యుద్ధం వేళ వస్తోన్న ఒత్తిళ్ల నడుమ శ్రీలంక తటస్థ వైఖరిని కొనసాగించేందుకు కట్టుబడి ఉందని దిసనాయకే స్పష్టం చేశారు. ఎన్ని ఒత్తిళ్లు ఉన్నా సరే తాము తటస్థ వైఖరినే కొనసాగించాలనుకుంటున్నామన్నారు. ఈ యుద్ధం సవాళ్లను విసురుతోందన్న ఆయన.. ఒత్తిళ్లకు శ్రీలంక తలొగ్గదని, తటస్థంగా ఉండేందుకు సాధ్యమైనదంతా చేస్తామని తెలిపారు.



### జొమాటోలో ఫుడ్ ఆర్డర్ మరింత భారం...

## పెరిగిన ప్లాట్‌ఫామ్ ఫీజు




**న్యూఢిల్లీ:** ప్రముఖ ఫుడ్ డెలివరీ సంస్థ జొమాటో తన యూజర్లపై మరోసారి భారం మోపింది. ప్రతి ఆర్డర్‌పై వసూలు చేసే ప్లాట్‌ఫామ్ ఫీజును 19.2 శాతం పెంచింది. ఈ కొత్త పెంపుతో ఒక్కో ఆర్డర్‌పై ఛార్జీ రూ. 2.40 పెరిగింది. శుక్రవారం నుంచి జొమాటో యాప్‌లో ఈ మార్పులు కనిపించాయి.

తాజా పెంపుతో జీఎస్టీకి ముందు ప్లాట్‌ఫామ్ ఫీజు రూ. 12.50 నుంచి రూ. 14.90కి చేరింది. పెరిగిన ఎల్పీజీ, ముడిచమురు ధరల కారణంగా రెస్టారెంట్లు, డెలివరీ పార్ట్‌నర్ల నిర్వహణ వ్యయాలు పెరిగాయి. ఈ నేపథ్యంలోనే మార్జిన్లు, యూనిట్ ఎకనామిక్స్‌ను మెరుగుపరచుకోవడానికి కంపెనీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

జొమాటో 2023 ఆగస్టులో తొలిసారి ఆర్డర్‌పై రూ. 2 ప్లాట్‌ఫామ్ ఫీజును ప్రవేశపెట్టింది. అప్పటి నుంచి దశలవారీగా పెంచుతూ వస్తోంది. గతేడాది సెప్టెంబర్ 2025లో చివరిసారిగా ఫీజును సవరించింది. అంతకుముందు ఫిబ్రవరిలో పండుగల సీజన్‌లో ఫీజును రూ. 6 నుంచి రూ. 10కి పెంచింది. జొమాటోకు పోటీగా ఉన్న స్విగ్గీ ప్రస్తుతం పన్నులతో కలిపి ప్రతి ఆర్డర్‌పై రూ. 14.99 ప్లాట్‌ఫామ్ ఫీజు వసూలు చేస్తోంది.

ఇదిలా ఉండగా, జొమాటో మాతృ సంస్థ 'ఎటర్నల్' షేరు శుక్రవారం 1.86 శాతం లాభపడి రూ. 233 వద్ద ముగిసింది. డిసెంబర్ త్రైమాసికంలో కంపెనీ నికర లాభం 72.88 శాతం పెరిగి రూ. 102 కోట్లకు చేరినట్లు ప్రకటించింది.

### ఇండస్ట్రియల్ డీజిల్ ధరల మోత...

**లీటర్‌పై ఏకంగా రూ.22 పెంపు**



**న్యూఢిల్లీ:** అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు దేశీయ ఇంధన ధరలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా మధ్య యుద్ధ వాతావరణం కారణంగా క్రూడ్ ఆయిల్ ధరలు భగ్గుమనడంతో, చమురు మార్కెటింగ్ కంపెనీలు ధరలను భారీగా పెంచాయి. ముఖ్యంగా పరిశ్రమల్లో వాడే బల్క్ డీజిల్ (ఇండస్ట్రియల్ డీజిల్) ధరను లీటరుకు ఏకంగా రూ.22.03 పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి.

శుక్రవారం నుంచి ఈ కొత్త ధరలు అమలులోకి వచ్చాయి. ఈ పెంపుతో లీటరు ఇండస్ట్రియల్ డీజిల్ ధర రూ.87.57 నుంచి రూ.109.59కి చేరింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) కూడా తన ధరలను సవరించింది.

సాధారణ వాహనాల్లో కాకుండా ఫ్యాక్టరీలు, షాపింగ్ మాల్స్, నిర్మాణ రంగంలోని భారీ యంత్రాలు, జనరేటర్లలో ఈ ఇండస్ట్రియల్ డీజిల్‌ను వినియోగిస్తారు. దీని ధర పెరగడం వల్ల పరిశ్రమల ఉత్పత్తి వ్యయం గణనీయంగా పెరుగుతుంది. ఈ భారం పరోక్షంగా రవాణా, ఇతర వ్యాపార కార్యకలాపాలపై పడి చివరికి నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు దారితీస్తుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మరోవైపు, స్పీడ్, పవర్ వంటి ప్రీమియం పెట్రోల్ రకాల ధరలను కూడా లీటరుకు రూ.2.09 మేర పెంచారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో ముడి చమురు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని, ఇది దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని అంచనా వేస్తున్నారు.

### ఇరాన్-ఇజ్రాయెల్ టెన్షన్..

**చివరి గంటలో లాభాలను కోల్పోయిన మార్కెట్లు**



**ముంబై:** భారత స్టాక్ మార్కెట్లు శుక్రవారం నాడు లాభాలతో ముగిసినప్పటికీ, చివరి గంటలో అమ్మకాల ఒత్తిడితో ఇంట్రాడే గరిష్ఠాల నుంచి వెనక్కి తగ్గాయి. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య మళ్లీ ఉద్రిక్తతలు పెరగడంతో అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగాయి. ఈ పరిణామం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 325.72 పాయింట్లు లాభపడి 74,532.96 వద్ద, నిఫ్టీ 112.35 పాయింట్లు పెరిగి 23,114.50 వద్ద స్థిరపడ్డాయి.

ట్రేడింగ్ చివరి గంటలో మధ్యప్రాచ్యంలో దాడులు జరిగినట్లు వార్తలు రావడంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరిగాయి. ఇది గ్లోబల్ ఎనర్జీ సరఫరాపై ఆందోళనలను రేకెత్తించింది. భారత్ వంటి చమురు దిగుమతులపై ఆధారపడిన దేశాలకు ఇది ప్రతికూల అంశం కావడంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. దీంతో సూచీలు రోజు గరిష్ఠాల నుంచి కిందకు జారాయి.

ఈ ప్రభావం బ్రాడర్ మార్కెట్లపైనా కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.67 శాతం లాభంతో ముగియగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ కేవలం 0.09 శాతం లాభంతో సరిపెట్టుకుంది. రంగాలవారీగా చూస్తే, నిఫ్టీ రియల్టీ సూచీ సుమారు 1 శాతం క్షీణించింది. దీనికి భిన్నంగా, ఫార్మా, పీఎస్‌యూ బ్యాంక్ వంటి రంగాలు మంచి లాభాలను నమోదు చేశాయి.

మరోవైపు, డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ చరిత్రాత్మక కనిష్ఠానికి పడిపోయింది. శుక్రవారం ట్రేడింగ్‌లో 1.17 శాతం నష్టపోయి 93.71 వద్ద ముగిసింది. టెక్నికల్‌గా నిఫ్టీకి 23,350 పాయింట్ల వద్ద బలమైన నిరోధం ఉందని, 23,000 స్థాయిని కోల్పోతే మరింత దిద్దుబాటుకు అవకాశం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. రానున్న రోజుల్లో మార్కెట్లు భౌగోళిక రాజకీయ పరిణామాలు, చమురు ధరల కదలికలను నిశితంగా గమనిస్తాయని భావిస్తున్నారు.

### వన్డే ప్రపంచకప్ 2027 లక్ష్యంగా

# బీసీసీఐ మాస్టర్ ప్లాన్

## ఐపీఎల్‌పై సెలెక్టర్ల కన్ను

**న్యూఢిల్లీ:** వన్డే ప్రపంచకప్ 2027 టోర్నమెంట్‌కు ఇంకా ఏడాదికి పైగా సమయం ఉన్నప్పటికీ, బీసీసీఐ ఇప్పటినుంచే పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ఈ మెగా టోర్నీ కోసం సుమారు 20 మంది ఆటగాళ్లతో కూడిన ప్రాబబుల్స్ జాబితాను సెలక్టర్లు ఇప్పటికే సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ నెల 28న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య జరిగే మ్యాచ్‌తో ప్రారంభం కానున్న ఐపీఎల్ 2026 సీజన్‌లో ఈ ఆటగాళ్ల ప్రదర్శనను నిశితంగా గమనించాలని సెలక్షన్ కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు పీటీఐ ఒక కథనంలో పేర్కొంది.

సెలెక్షన్ కమిటీ సభ్యులు ఎస్ఎస్ దాస్, ఆర్పీ సింగ్, అజయ్ రాత్రా, ప్రగ్యాన్ ఓఝా.. ఐపీఎల్ మ్యాచ్‌లను ప్రత్యక్షంగా స్టేడియాల్లోనూ, టీవీల్లోనూ పర్యవేక్షించనున్నారు. ప్రతీ వారం కనీసం ఐదు మ్యాచ్‌లను కవర్ చేసేలా, ఒక్కో సెలక్టర్ ఒక్కో మ్యాచ్‌కు హాజరయ్యేలా ప్రణాళిక రచించినట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ఈ పర్యవేక్షణ కేవలం వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకొని మాత్రమే జరుగుతుందని, 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్ లేదా టీ20 ప్రపంచకప్‌ను పరిగణనలోకి తీసుకోవడం లేదని స్పష్టమైంది.

సెలక్టర్లు ప్రధానంగా జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్,







ప్రసిద్ధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్‌లతో పాటు ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా వంటి ఆటగాళ్లపై దృష్టి సారించనున్నారు. మోకాలి గాయం నుంచి కోలుకుంటున్న హర్షిత్ రాణాకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది.


మరోవైపు జూన్ 6 నుంచి 10 వరకు ముల్లన్‌పూర్‌లో ఆఫ్ఘనిస్థాన్‌తో జరగనున్న ఏకైక టెస్టు మ్యాచ్‌కు పూర్తిస్థాయి జట్టును పంపాలని బీసీసీఐ భావిస్తోంది. ఈ మ్యాచ్‌కు ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్లు లేనప్పటికీ, దీనిని తేలిగ్గా తీసుకోవడం లేదని బీసీసీఐ వర్గాలు స్పష్టం చేశాయి.

ఆగస్టు నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు భారత్ తొమ్మిది టెస్టులు ఆడాల్సి ఉన్నందున, ఈ మ్యాచ్‌లో కీలక ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చే ఉద్దేశం లేదని తెలుస్తోంది. ఐపీఎల్ సమయంలో గాయపడకపోతే బుమ్రా, సిరాజ్ కూడా ఆఫ్ఘనిస్థాన్‌తో టెస్టు ఆడే జట్టులో ఉంటారని ఆ వర్గాలు పేర్కొన్నాయి. "భారత టెస్టు జట్టు ప్రయోగాలకు వేదిక కాదు. దానికోసం ఇండియా-ఏ పర్యటనలు ఉన్నాయి. ప్రస్తుతం టెస్టుల్లో బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ మా మొదటి ప్రాధాన్యత" అని బీసీసీఐ అధికారి ఒకరు వివరించారు.

### అగార్కర్ కాంట్రాక్ట్

# ఎప్పటివరకు?

**కొనసాగింపుపై కీలక అప్‌డేట్!**



**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ జట్టు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ తన పదవీకాలాన్ని 2027 వన్డే ప్రపంచకప్ వరకు పొడిగించాలని బీసీసీఐని కోరినట్టు వస్తున్న వార్తల్లో నిజం లేదని తేలిపోయింది. ఈ ప్రచారాన్ని బీసీసీఐకి చెందిన ఒక సీనియర్ అధికారి పూర్తిగా ఖండించారు.

పీటీఐ కథనం ప్రకారం... అగార్కర్ ఈ విషయంపై బోర్డుతో ఎలాంటి చర్చలు జరపలేదని, ఆయన పొడిగింపు కోరాల్సిన అవసరం కూడా లేదని సదరు అధికారి స్పష్టం చేశారు. 2023లో సెలెక్షన్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అగార్కర్ హయాంలో భారత్ 2024, 2026 టీ20 ప్రపంచకప్‌లతో పాటు 2025 ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన సంగతి తెలిసిందే.

"సెలెక్షన్ ప్యానెల్ అనేది బీసీసీఐకి చెందిన ఒక ఉప-కమిటీ. ప్రస్తుత సెలెక్టర్ల కాంట్రాక్ట్ ఈ ఏడాది సెప్టెంబర్‌తో ముగుస్తుంది. ఆ తర్వాత అగార్కర్ కొనసాగింపుపై బీసీసీఐ కార్యదర్శి, అగార్కర్ చర్చించుకుని నిర్ణయం తీసుకుంటారు. బీసీసీఐ నిబంధనల ప్రకారం ఒక సీనియర్ సెలెక్టర్ నాలుగేళ్ల వరకు పదవిలో కొనసాగవచ్చు. కాబట్టి ఆయన ప్రత్యేకంగా పొడిగింపు కోరాల్సిన అవసరం లేదు" అని ఆ అధికారి వివరించారు.

### మూడో టీ20లో దక్షిణాఫ్రికాపై

## 8 వికెట్ల తేడాతో కివీస్ గెలుపు




**ఆక్లాండ్:** దక్షిణాఫ్రికాతో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో న్యూజిలాండ్ 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఆక్లాండ్‌లో జరిగిన మ్యాచ్‌లో ఫస్ట్ బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి కేవలం 136 రన్స్ మాత్రమే చేసింది. ఆ తర్వాత స్వల్ప టార్గెట్‌తో బరిలోకి దిగిన కివీస్ కేవలం 16.2 ఓవర్లలో టార్గెట్‌ను అందుకున్నది. కివీస్ ఓపెనర్ టామ్ లాథమ్ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అతను 63 రన్స్ చేశాడు. తొలి వికెట్‌కు డేవాన్ కాన్వేతో కలిసి 96 పరుగులు జోడించారు. కాన్వే 39 పరుగులు చేయగా, లాథమ్ టీ20ల్లో నాలుగవ హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. మరో 22 బంతులు మిగిలి ఉండగానే కివీస్ విజయాన్ని అందుకున్నది. దీంతో అయిదు మ్యాచ్‌ల సిరీస్‌లో కివీస్ 2-1 తేడాతో ఆధిక్యాన్ని సాధించింది. కివీస్ బౌలర్ లాకీ ఫెర్గూసన్ అత్యద్భుతంగా బౌలింగ్ చేశాడు. చాలా కట్టుదిట్టంగా అతను బౌలింగ్ చేసి 4 ఓవర్లలో ఒక వికెట్ తీసి కేవలం 9 రన్స్ మాత్రమే ఇచ్చాడు. బెస్ట్ బౌలింగ్ చేసిన ఫెర్గూసన్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది.

# డీప్‌ఫేక్‌పై గంభీర్ న్యాయపోరాటం..

**విచారణ వాయిదా**




**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ జట్టు హెడ్ కోచ్, మాజీ ఆటగాడు గౌతమ్ గంభీర్ తన వ్యక్తిగత హక్కుల (పర్సనాలిటీ రైట్స్) పరిరక్షణ కోసం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించాడు. తన పేరు, ఫొటోలు, వాయిస్‌ను ఉపయోగించి డీప్‌ఫేక్ కంటెంట్ సృష్టిస్తున్నారని, డిజిటల్ మాధ్యమాల్లో తనను తప్పుగా చిత్రీకరిస్తున్నారని ఆరోపిస్తూ పిటిషన్ దాఖలు చేశాడు. ఈ పిటిషన్‌పై ఇవాళ విచారణ చేపట్టిన జస్టిస్ జ్యోతి సింగ్ బెంచ్, పిటిషన్‌లోని కొన్ని లోపాలను సరిచేయాలని సూచిస్తూ తదుపరి విచారణను ఈ నెల 23కు వాయిదా వేసింది.

గంభీర్ తన పిటిషన్‌లో 16 సంస్థలను ప్రతివాదులుగా చేర్చారు. వీరిలో మెటా, ఎక్స్ (ట్విట్టర్), గూగుల్ (యూట్యూబ్) వంటి సోషల్ మీడియా దిగ్గజాలతో పాటు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఈ-కామర్స్ సంస్థలు కూడా ఉన్నాయి. కేంద్ర ఐటీ, టెలికాం శాఖలను కూడా ప్రతివాదుల జాబితాలో చేర్చారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టూల్స్ సహాయంతో ఫేస్-స్వాపింగ్, వాయిస్-క్లోనింగ్ చేసి, తనపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని గంభీర్ ఆరోపించాడు.

ఇటీవల కాలంలో ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్, యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటి వేదికలపై ఇలాంటి నకిలీ కంటెంట్ గణనీయంగా పెరిగిపోయిందని గంభీర్ తన పిటిషన్‌లో పేర్కొన్నాడు. తాను రాజీనామా చేస్తున్నట్లుగా సృష్టించిన ఒక డీప్‌ఫేక్ వీడియోకు 29 లక్షలకు పైగా వ్యూస్ రాగా, ప్రపంచకప్‌లో సీనియర్ ఆటగాళ్ల గురించి తాను వ్యాఖ్యానించినట్లు ఉన్న మరో నకిలీ వీడియోకు 17 లక్షల వ్యూస్ వచ్చాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లాడు. ఈ తరహా కంటెంట్ ప్రజలను తప్పుదోవ పట్టించడమే కాకుండా భారత జట్టు హెడ్ కోచ్‌గా ఉన్న తన వృత్తికి, ప్రతిష్ఠకు తీవ్ర నష్టం కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశాడు.

ఈ-కామర్స్ సైట్లలో తన అనుమతి లేకుండా తన పేరు, ఫొటోలతో పోస్టర్లు, ఇతర వస్తువులు అమ్ముతున్నారని కూడా గంభీర్ ఆరోపించాడు. తన గుర్తింపును ఆయుధంగా వాడుకుని కొందరు అజ్ఞాత వ్యక్తులు తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తూ డబ్బు సంపాదిస్తున్నారని పేర్కొన్నాడు.

కాపీరైట్, ట్రేడ్‌మార్క్ చట్టాల కింద దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో తన పేరు, ఫొటో, వాయిస్‌ను ఎలాంటి మాధ్యమంలోనైనా తన అనుమతి లేకుండా వాడకుండా శాశ్వత ఇంజంక్షన్ విధించాలని గంభీర్ కోరాడు. పరువు నష్టానికి పరిహారంగా రూ. 2.5 కోట్లు ఇప్పించాలని, అక్రమంగా సంపాదించిన లాభాల లెక్కలు సమర్పించాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఈ కంటెంట్‌ను తొలగించాలని కూడా అభ్యర్థించాడు.

ఇటీవలి కాలంలో సునీల్ గవాస్కర్, శ్రీశ్రీ రవిశంకర్, నటులు నాగార్జున, ఐశ్వర్య రాయ్ బచ్చన్, కాజోల్ వంటి అనేక మంది ప్రముఖులు తమ వ్యక్తిగత హక్కుల పరిరక్షణ కోసం కోర్టులను ఆశ్రయించిన విషయం తెలిసిందే.



# అట్టహాసంగా గద్దర్ ఫిల్మ్ అవార్డులు

### సీఎం రేవంత్ చేతుల మీదుగా ప్రదానం

### తారల రాకతో పులకించిన చిత్రసీమ

**టాకీస్:** ఉగాది సందర్భంగా గద్దర్ తెలంగాణ సినీ అవార్డులు వేడుక అంగరంగ వైభవంగా సాగింది. చిత్రసీమ మొత్తం తరలిరావడంతో సంబరాలు అంబరాన్ని అంటాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ సినీ పురస్కారాల్ని ఏర్పాటు చేసి రెండేళ్లుగా ఘనంగా ప్రదానం చేస్తోంది. ఉగాది అనగానే గతంలో తెలుగు ప్రేక్షకులు.. చిత్రసీమ సినీ పురస్కారాల పండగని గుర్తు చేసుకొనేది. పలు కారణాలతో మధ్యలో పద్నాలుగేళ్లపాటు ఈ పురస్కారాలకు నోచుకోలేకపోయింది తెలుగు సినిమా. గతేడాది నుంచి సినిమా రంగంలోని ప్రతిభకు పట్టం కడుతూ... ఉత్తమ చిత్రాల రూపకల్పన కోసం ప్రోత్సాహాన్ని అందించడంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ సినీ పురస్కారాల్ని ప్రదానం చేస్తోంది. గత ఆనవాయితీ మేరకే ఈసారి ఉగాది సందర్భంగానే గద్దర్ సినీ పురస్కారోత్సవం - 2025 వేడుకని నిర్వహించడం విశేషం. తెలుగు సంవత్సరాది రోజున... పురస్కారాల్ని చేతపట్టి సినీ తారలు, సాంకేతిక బృందాలు, దర్శక నిర్మాతలు మురిసిపోయారు. దక్షిణాది తారలతోపాటు... హిందీ తారలూ ఈ వేడుకలో పాల్గొని ప్రధాన ఆకర్షణగా నిలిచారు.సాంస్కృతిక కార్యక్రమాలు, జ్యోతిప్రజ్వలనతో ప్రారంభమైన ఈ వేడుక ఆద్యంతం సందడిగా సాగింది. అలనాటి తారలు సావిత్రి, శ్రీదేవి, సౌందర్య తదితరుల్ని గుర్తు చేస్తూ... కథానాయిక నిధి అగర్వాల్ వేదికపై చేసిన నృత్యాలు, గాయని మంగ్లీ ఆటాపాట, 'నాగబంధం'లోని నమోరే పాటకు నభా నటేశ్, దక్ష నాగర్కర్ నృత్యాలు, దేవిశ్రీప్రసాద్ హుషారెత్తించేలా పాడిన పాటలు, ఆయన మార్క్ సంగీత ప్రదర్శనలు వేడుకకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలుగుసినీ తారలు, పురస్కార గ్రహీతలతోపాటు హిందీ నుంచి వచ్చిన మాధురీ దీక్షిత్, జెనీలియా, రితేశ్ దేశ్‌ముఖ్ సందడితో వేడుక కళకళలాడింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పర్యటక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు, టీఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు, ఎఫ్.డి.సి ఎండీ సీహెచ్ ప్రియాంక తదితరులు విజేతలకు పురస్కారాల్ని ప్రదానం చేశారు. సాయిప్రసాద్ (తండ్రి రమేశ్ ప్రసాద్ బదులుగా, రఘుపతి వెంకయ్య ఫిల్మ్ అవార్డు), సుద్దాల అశోక్ తేజ (సి.నారాయణరెడ్డి ఫిల్మ్ అవార్డు), అశ్వినీ దత్ (నాగిరెడ్డి చక్రపాణి అవార్డు), కమల్‌హాసన్ (సింగీతం శ్రీనివాసరావుకు బదులుగా, బీఎన్ రెడ్డి ఫిల్మ్ అవార్డు) దక్కించుకున్నారు. సిఎంరేవంత్‌రెడ్డి, రామ్‌చరణ్ చేతుల మీదుగా పురస్కారం



స్వీకరిస్తున్న నాగచైతన్య, రష్మిక ఉత్తమ నటి పురస్కారం అందుకోవడానికి వేదికపైకి వచ్చిన రష్మిక మందన్నని 'మా ఊరి కోడలు...' అంటూ యాంకర్ సుమకి పరిచయం చేశారు రేవంత్‌రెడ్డి. పురస్కారం అందుకున్న అనంతరం రష్మిక మాట్లాడుతూ రేవంత్ రెడ్డి చేతులమీదుగా అందుకున్న ఈ పురస్కారం ఎంతో ప్రత్యేకం. రాష్ట్ర ప్రభుత్వం నా నటనని మెచ్చి పురస్కారం ఇచ్చిందని అన్నారు. ఉత్తమ నటుడిగా పురస్కారం అందుకున్న నాగచైతన్య మాట్లాడుతూ 'పదహారేళ్ల సినీ ప్రయాణంలో ఇదెంతో ప్రత్యేకమైన గుర్తింపు. గద్దర్ గొప్ప వ్యక్తి, విప్లవకారుడు. ఆయన పేరు మీద ఏర్పాటు చేసిన ఈ పురస్కారాన్ని అందుకున్నందుకు ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందని అన్నారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, సీనియర్ కథానాయిక మాధురీ దీక్షిత్ నుంచి ఎన్టీఆర్ జాతీయ పురస్కారం అందుకున్న అనంతరం చిరంజీవి మాట్లాడుతూ 'కళాకారులకు ఎక్కడ గౌరవం దక్కుతుందో ఆ రాష్ట్రం, ఆ దేశం, ఆ రాజ్యం సుభిక్షంగా ఉంటుందని నానుడి. దాని అర్థం పరమార్థం గ్రహించి నిర్లక్ష్యానికి గురైన పురస్కారాల్ని మళ్లీ పునరుద్ధరించి, పునరుజ్జీవం పోసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు. ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటాం. మేం కలిసిన ప్రతిసారీ సినిమా గురించి, సినిమా అభివృద్ధి గురించే చర్చ ఉంటుంది. తెలుగు సినిమా, దక్షిణ భారత సినిమా అని కాదు, భారతదేశ సినిమాకు హైదరాబాద్‌ని కేంద్రంగా నిలిపేందుకు, ఆ దిశగా తెలుగు చిత్ర పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు సమాయత్తం అవుతున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. గ్లోబల్ సమ్మిట్ జరిగినప్పుడు సినిమాకి ప్రాధాన్యం కల్పించారు. చిత్ర పరిశ్రమకు చెందిన మంచి చెడులు చర్చించి సదుపాయాలు కల్పించేందుకు ముందుకొచ్చారు. సినిమావాళ్లకు అతి దగ్గరగా ఉన్నటువంటి ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గద్దర్ సినీ పురస్కారాల్ని స్ఫూర్తిగా తీసుకొని, ఆ దిశగా ప్రోత్సహిస్తే యువతరం మరిన్ని సినిమాలు చేస్తుంది' అన్నారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, కథానాయకుడు నాగార్జున చేతులమీదుగా అక్కినేని నాగేశ్వరరావు పురస్కారం అందుకున్న జయసుధ మాట్లాడుతూ 'ఏఎన్నార్‌తో ఎన్నో గొప్ప చిత్రాల్లో నటించాను. ఆయన హృదయానికి చికిత్స జరిగిన అనంతరం తిరిగి సినిమాల్లోకి వచ్చినప్పుడు 'ట్రెండ్ మారిపోయింది కదా, నటనలో ఏమైనా మార్పులు చేసుకోవాలా?' అంటూ అప్పుడప్పుడే పరిశ్రమలోకి వచ్చిన నటుడిలా అడిగేవారు. అంత గొప్ప నటుడు అంత సాధారణంగా ఉండటం మా అందరికీ ఓ గొప్ప పాఠం' అన్నారు. కాంతారావు పురస్కారాన్ని అందుకున్న ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ 'పదమూడేళ్లపాటు సినీ పరిశ్రమ పురస్కారాల కోసం ఎదురు చూసింది. అలాంటిది సూపర్‌స్టార్ కృష్ణ అభిమాని అయిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతేడాది పురస్కారాల్ని పునః ప్రవేశపెట్టి తెలుగు సినిమా ఉనికిని, కళాకారుల్ని గుర్తించి, గౌరవించినందుకు నా అభినందనలు. గద్దర్ ప్రజా వాగ్గేయకారుడు. ఆయన పేరుపై ఈ పురస్కారాల్ని అందించినందుకు నా సెల్యూట్. ఎన్టీఆర్, ఏఎన్నార్ తర్వాత అంతటి మరో హీరో కాంతారావు. తెలంగాణ గడ్డ బిడ్డ అయిన ఆయన పేరుపై పురస్కారాన్ని నాకు ఇచ్చి జన్మ ధన్యం చేశారు' అన్నారు. బి.ఎన్.రెడ్డి పురస్కారానికి ఎంపికైన సీనియర్ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు తరఫున కమల్‌హాసన్ పురస్కారాన్ని స్వీకరించడం విశేషం. పైడి జయరాజ్ పురస్కారాన్ని అందుకున్న కమల్‌హాసన్ మాట్లాడుతూ 'సింగీతం పురస్కారం అందుకున్నప్పుడు నాకు ఆయన 'సొమ్మొకడిది సోకొకడిది' సినిమా గుర్తుకొచ్చింది. గద్దర్‌కు ఉన్న మిలియన్లకొద్దీ అభిమానుల్లో నేను ఒకడిని. నా సినిమా కెరీర్‌లో నేను కలిసిన అత్యంత యువకుడైన సీనియర్ ఆయన. కవి, విప్లవకారుడైన ఆయన్ను గౌరవిస్తూ ఈ పురస్కారం ఏర్పాటు చేయడంతోనే మా అందరికీ గౌరవం దక్కినట్లైంది.'అన్నారు.

## MOVIE TIME

# కళాకారులకు గౌరవం గర్వకారణం: చిరంజీవి



టాకీస్: కళాకారులు గౌరవించబడే చోటు సుభిక్షంగా ఉంటుందన్నది నానుడి. ఈ అవార్డులు అందజేస్తున్న తెలంగాణ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. సినిమాలు జపాన్, దక్షిణకొరియా దేశాల్లో ఆర్థికంగా ప్రభావం చూపాయి. వాటి జీడీపీ పెరిగింది. సినీరంగం ప్రాముఖ్యతను కేంద్ర ప్రభుత్వం కూడా గుర్తించింది. సినిమాతో రాష్ట్ర ఎకానమీ పెంచుకోవచ్చు. సినీ పరిశ్రమ అభివృద్ధి కోసం ఏ బాధ్యతనైనా స్వీకరిస్తాం' అని చిరంజీవి అన్నారు. తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డుల్లో చిరంజీవి.. ఎన్టీఆర్ జాతీయ పురస్కారం అందుకున్నారు.

# నేను తెలంగాణ కోడలిని.. నా ఫ్యామిలీని జాగ్రత్తగా చూసుకోండి

### గద్దర్ అవార్డుల వేడుకలో రష్మిక భావోద్వేగం

టాకీస్: పద్నాలుగేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత తెలంగాణ ప్రభుత్వం 'గద్దర్ సినీ పురస్కారాల' పేరుతో పునఃప్రారంభించిన సినీ అవార్డుల వేడుక వరుసగా రెండో ఏడాది కూడా అత్యంత వైభవంగా జరిగింది. ఉగాది పర్వదినం సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకలో టాలీవుడ్ నటి రష్మిక మందన్న ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'గర్ల్ ఫ్రెండ్' చిత్రంలో తన అద్భుత నటనకు గాను ఆమె ఉత్తమ నటిగా అవార్డును అందుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్న అనంతరం రష్మిక ప్రసంగిస్తూ భావోద్వేగానికి గురయింది. "గతంలో నా నటనపై ఎన్నో విమర్శలు వచ్చాయి. సోషల్ మీడియాలో తీవ్రమైన ట్రోల్స్ ఎదుర్కొన్నాను. కానీ ఈరోజు రాష్ట్ర ప్రభుత్వం నా ప్రతిభను గుర్తించి, ఈ గౌరవాన్ని అందించడం నాపై ఉన్న బాధ్యతను పెంచింది. ముఖ్యమంత్రి గారి చేతుల మీదుగా ఈ అవార్డు అందుకోవడం నా జీవితంలో మర్చిపోలేని అనుభూతి" అని ఆమె పేర్కొంది. ఇటీవల టాలీవుడ్ సెన్సేషన్ విజయ్ దేవరకొండను వివాహం చేసుకున్న రష్మిక, తన ప్రసంగంలో చేసిన వ్యాఖ్యలు అందరి హృదయాలను హత్తుకున్నాయి. "ఇప్పటివరకు నన్ను మీ ఇంటి ఆడబిడ్డలా, కూతురిలా ఆదరించారు. కానీ ఇప్పుడు నేను తెలంగాణ కోడలిగా మీ ముందుకు వచ్చాను. నా ఫ్యామిలీని (దేవరకొండ కుటుంబం) మీరందరూ జాగ్రత్తగా చూసుకోండి" అని ఆమె అనగానే సభా ప్రాంగణం మొత్తం హర్షధ్వానాలతో మారుమోగిపోయింది. రష్మిక మాటలకు గ్యాలరీలో ఉన్న విజయ్ దేవరకొండ తల్లి కూడా భావోద్వేగానికి గురి కావడం అక్కడున్న వారిని కదిలించింది.



# ఆకట్టుకుంటున్న 'హ్యాపీ రాజ్' ట్రైలర్






**టాకీస్:** 90వ దశకంలో తన స్టైల్ మరియు నవ్వుతో కుర్రకారును ఉర్రూతలూగించిన లవర్ బాయ్ అబ్బాస్ మళ్లీ కెమెరా ముందుకు వచ్చాడు. సుమారు 11 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆయన వెండితెరపై కనిపించబోతున్నారు. జీవీ ప్రకాష్ కుమార్ హీరోగా నటిస్తున్న 'హ్యాపీ రాజ్' చిత్రంతో ఆయన తన సెకండ్ ఇన్నింగ్స్‌ను ప్రారంభిస్తున్నారు. తాజాగా విడుదలైన ఈ చిత్ర తెలుగు ట్రైలర్ ఇప్పుడు సోషల్ మీడియాలో విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ సినిమాలో అబ్బాస్ పాత్ర చాలా కీలకంగా ఉండబోతోంది. హీరోయిన్‌గా తెలుగు నటి శ్రీ గౌరీ ప్రియ నటిస్తుండగా.. ఆమె తండ్రిగా, అమెరికాలో నివసించే 'రాజీవ్' అనే ఎన్నారై పాత్రలో అబ్బాస్ కనిపించబోతున్నాడు. ట్రైలర్‌లో ఆయన లుక్ చూస్తుంటే, ఒకప్పటి 'మిన్నలే' (తెలుగులో 'చెలి') సినిమాలోని అబ్బాస్‌ను గుర్తుకు తెచ్చేలా స్టైలిష్‌గా ఉండటం విశేషం. రాజా ఎలాంచెజియన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా.. ఇదొక క్లీన్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ మరియు రొమాంటిక్ కామెడీగా రాబోతుంది. పెళ్లి పీటల వరకు వెళ్లాలనుకునే ఒక జంటకు, వారి కుటుంబాల మధ్య ఎదురయ్యే సరదా సంఘటనలు, ఎమోషన్స్‌తో ఈ సినిమా రూపొందింది. తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ విడుదల చేస్తోంది.

# ఉస్తాద్ భగత్ సింగ్ హిట్ టాక్

### దర్శకుడు హరీష్ శంకర్ ఆనందం



**టాకీస్:** ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా బాగుందన్న అభిప్రాయం రావడం ఎంతో ఆనందాన్నిచ్చిందని దర్శకుడు హరీష్‌శంకర్ అన్నారు. ఆయన దర్శకత్వంలో... పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా తెరకెక్కిన చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్'. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, రవిశంకర్.వై సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రం ఉగాది సందర్భంగా గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం విలేకర్ల సమావేశం నిర్వహించింది. దర్శకుడు మాట్లాడుతూ 'పవన్‌కల్యాణ్ అభిమానులు ఫోన్ చేసి 'అన్నా సినిమా చాలా బాగుంది' అంటున్నారు. అన్ని వర్గాల ప్రేక్షకులకూ నచ్చేలా సినిమాని మలిచాం. తొలి రోజు నుంచీ ఓ కమర్షియల్ సినిమా తీస్తున్నానని, ఒకప్పటిలా హుషారైన పవన్‌కల్యాణ్ ఇందులో కనిపిస్తారని చెబుతూ వచ్చా. సినిమా చూసినవాళ్లు ఈ సినిమాలో ఇన్ని అంశాలు ఉన్నాయని మాకు తెలియదంటూ ఆశ్చర్యపోతున్నారు. ఇందులోని ప్రతి పాత్ర బాగా పండింది. అందరికృషితోనే ఇంత మంచి సినిమా చేయగలిగాం అన్నారు. నిర్మాత నవీన్ ఎర్నేని మాట్లాడుతూ థియేటర్ల దగ్గర పండగ వాతావరణం కనిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అమెరికా అనే తేడా లేకుండా అన్ని చోట్లా ప్రేక్షకులు సినిమాని ఆస్వాదిస్తున్నారు. మేం ఊహించిన దానికంటే మంచి స్పందన వచ్చింది. పవన్ కల్యాణ్ వన్ మేన్ షో ఇది. హరీశ్‌శంకర్ ఎంతో బాధ్యతగా 'గబ్బర్‌సింగ్' సినిమాని మించేలా తెరకెక్కించారు. కచ్చితంగా భారీ వసూళ్లు సాధిస్తుందీ చిత్రం' అన్నారు. నిర్మాత రవిశంకర్.వై మాట్లాడుతూ 'పెద్ద హీరో నుంచి వాణిజ్య ప్రధానమైన సినిమా వచ్చి చాలా కాలమైంది. ఇందులో కుటుంబ ప్రేక్షకులు మెచ్చే అంశాలూ ఉన్నాయి. మాకు ఎప్పటికీ గుర్తుండిపోయే ఈ సినిమా విజయంపై మేం సంతోషంగా ఉన్నాం' అన్నారు. ఈ కార్యక్రమంలో కళా దర్శకుడు ఆనంద్‌సాయి, గీత రచయిత చంద్రబోస్ పాల్గొన్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.